మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

Published from Jagitial
Circulated to Telangana

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 3-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 243 Issue: 243

www.evarthalu.com


03 మార్చి 2026 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:36 సూర్యాస్తమయం - సా. 6:19 తిథి పౌర్ణమి సా. 5:11 వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం మఖ ఉ. 7:28 వరకు తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ) యోగం సుకర్మ ఉ. 10:23 వరకు కరణం బవ సా. 5:11 వరకు భాలవ తె. 4:560 వరకు వర్జ్యం మ. 3:33 నుండి సా. 5:09 వరకు దుర్ముహూర్తం ఉ. 8:57 నుండి ఉ. 9:44 వరకు రా. 11:14 నుండి రా. 12:03 వరకు రాహుకాలం మ. 3:23 నుండి సా. 4:51 వరకు యమగండం ఉ. 9:32 నుండి ఉ. 11:00 వరకు గుళికాకాలం మ. 12:28 నుండి మ. 1:56 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:00 నుండి తె. 5:48 వరకు అమృత ఘడియలు తె. 5:08 నుండి ఉ. 6:43 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:04 నుండి మ. 12:51 వరకు

# గల్ఫ్ గజగజ

## పక్క దేశాలపై ఇరాన్ బాంబుల వర్షం

### దుబాయ్ సహా ప్రధాన నగరాల్లో పేలుళ్లు

గల్ఫ్ దేశాల్లో సోమవారం ఉదయం భయానక వాతావరణం నెలకొంది. దుబాయ్, అబుదాబి, దోహాతో పాటు పలు ప్రధాన నగరాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాన్ తన పొరుగు దేశాలపై దాడులను తీవ్రతరం చేయడంతో గల్ఫ్ ప్రాంతం ఉలిక్కిపడింది. ఇప్పటివరకు సైనిక స్థావరాలపై దాడులకే పరిమితమైన ఇరాన్.. ఇప్పుడు వ్యూహం మార్చి, నివాసాలు, విమానాశ్రయాలు, షాపింగ్ మాల్స్ పై దాడులు చేస్తుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.



దుబాయ్: ఒకవైపు ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య పరస్పర దాడులు కొనసాగుతుండగా, ఇరాన్ తన దాడులను ముమ్మరం చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. బహ్రెయిన్‌లో రాత్రిపూట భారీ శబ్దాలు, సైరన్ల మోతతో ప్రజలు నిద్రలేచారు. ఇక్కడ ఉన్న అమెరికా నేవీ ఫిఫ్త్ ఫ్లీట్ హెడ్ క్వార్టర్స్‌ను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ తొలుత దాడులు ప్రారంభించినట్లు కనిపించినా, ఆ తర్వాత లక్ష్యాలను మార్చుకుంది. గల్ఫ్ దేశాల సంపదకు చిహ్నాలుగా ఉన్న ఎత్తైన నివాస భవనాలు, లగ్జరీ హోటళ్లు, ఆధునిక విమానాశ్రయ టెర్మినల్స్‌పై కూడా ఇరాన్ దాడులకు తెగబడింది. కువైట్‌లోని అమెరికా వైమానిక స్థావరం సమీపంలో ఒక యుద్ధ విమానం కూలిపోయినట్లు తెలిసింది. అమెరికా, ఇజ్రాయెల్ వర్సెస్ ఇరాన్ మధ్య చెలరేగిన యుద్ధం కేవలం ఆ దేశాలకే పరిమితం కాలేదు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ యుద్ధ ప్రభావం నేరుగా ఇండియాపై పడుతోంది. ఇండియా తన ముడిచమురు అవసరాల్లో 85% దిగుమతులపైనే ఆధారపడుతుంది. కాబట్టి క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగితే, ఇండియాలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ తరువాయి 2 వ పేజీలో...



# చమురు మంటలు

## పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభం

### భారీగా పెరుగుతున్న క్రూడాయిల్ ధరలు

పశ్చిమాసియాలో కొనసాగుతున్న సైనిక ఘర్షణలు ముడి చమురు మార్కెట్‌ను కుదిపేస్తున్నాయి. ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణం తర్వాత పశ్చిమాసియా అగ్నిగుండంలా మారింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఇరాన్ మిస్సైల్స్, డ్రోన్ దాడులు చేపట్టడంతో హర్ముజ్ జలసంధి క్లోజ్ అయ్యింది. అదీకాక, గల్ఫ్ తీరంలో మూడు చమురు ట్యాంకర్లపై దాడులు జరిగాయి, షిప్పింగ్ రవాణా పూర్తిగా స్తంభించిపోయింది. ఈ నేపథ్యంలో ముడి చమురు ధరలు గణనీయంగా పెరిగాయి, సోమవారం ధరలు 9 శాతం మేర పుంజుకున్నాయి.




(ఈవార్తలు-బిజినెస్ డెస్క్)


ప్రస్తుతం బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 78.52 డాలర్లు (మన కరెన్సీలో సుమారు రూ.7,190)గా ఉంది. గత వారం వరకు ఈ ధర 67 డాలర్లుగా ఉండగా, 48 గంటల్లోనే 78 డాలర్లకు చేరుకుంది. ఈ పెరుగుదలను గణన చేస్తే, 67 డాలర్ల నుంచి 78 డాలర్లకు పెరగడం అంటే 11 డాలర్ల పెరుగుదల, అంటే 16.42 శాతం పెరుగుదలను సూచిస్తుంది. యుద్ధం 4-5 వారాలు తరువాయి 2 వ పేజీలో...

# మార్కెట్లపై బాంబ్

## ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు క్రాష్

### భారత్‌లో ఒక్కరోజే 6.5 లక్షల కోట్లు లాస్

ఇజ్రాయెల్, అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.. ఈ యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. ఇటు.. భారతీయ స్టాక్ మార్కెట్లు కూడా సోమవారం భారీ పతనాన్ని చవిచూశాయి. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్‌లో సెన్సెక్స్ 1000 పాయింట్లకు పైగా పతనమైంది.



ముంబై: జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ నిఫ్టీ 50 ఇండెక్స్ 25 వేల మార్క్ కోల్పోయింది. 24,700 పాయింట్ల దిగువకు పడిపోయింది. యుద్ధ భయాలతో సోమవారం ట్రేడింగ్ మొదలు కాగానే సూచీలు కుదేలయ్యాయి. క్రితం రోజు సెన్సెక్స్ 81,287.19 వద్ద ముగియగా ఈరోజు ఆరంభం లోనే ఏకంగా 2743 పాయింట్లు కోల్పోయి 78,543.73 వద్ద ట్రేడింగ్ మొదలు పెట్టింది. ఆ తర్వాత కాస్త కోలుకున్నప్పటికీ నష్టాల నుంచి మాత్రం బయటపడలేకపోయాయి. మార్కెట్లు ముగిసే నాటికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ సెన్సెక్స్ 30 ఇండెక్స్ 1048.34 పాయింట్లు నష్టపోయింది. దీంతో 80,238.85 వద్ద తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.17,051 |
| వెండి (గ్రాము): | రూ.315 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,976 |

## విశ్వవాణి



ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన యూనివర్సిటీ అయిన మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అందించే అన్ని కోర్సుల పుస్తకాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. ఎవరైనా సరే, ఉచితంగా యాక్సెస్ చేసి చదువుకొనేందుకు వీలుగా యూనివర్సిటీ ఈ నిర్ణయం తీసుకుంది.



# కెనడాతో యురేనియం డీల్

### రూ.23 వేల కోట్ల ఒప్పందం.. యురేనియం సరఫరాలో తీరిన కష్టాలు

భారత ప్రధాని నరేంద్ర మోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ మధ్య కీలక చర్చలు జరిగి చారిత్రాత్మక ఒప్పందాలు కుదిరాయి. ఇందులో అత్యంత ముఖ్యమైనది సివిల్ న్యూక్లియర్ ఎనర్జీ రంగంలో కెనడా భారతదేశానికి యురేనియం సరఫరా చేయడానికి అంగీకారం తెలిపింది. అంతేకాదు స్మాల్ మాడ్యులర్ రియాక్టర్స్, అడ్వాన్స్ రియాక్టర్ల అభివృద్ధి చేయడానికి కూడా కెనడాతో సంయుక్తంగా పనిచేసేందుకు ఈ ఒప్పందంలో నిర్ణయం తీసుకున్నాయి.

న్యూఢిల్లీ: ఓవైపు ప్రపంచవ్యాప్తంగా ఇరా న్ అమెరికా యుద్ధంతో సతమతం అవు తుంటే మరోవైపు భారత్ మాత్రం సైలెంట్‌గా కెనడా తో కలిసి యురేనియం సరఫరా ఒప్పందం కుదుర్చుకుంది. ఇది ఒక చారిత్రాత్మక సందర్భంగా నిపుణులు పేర్కొంటున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ మధ్య కీలక చర్చలు తరువాయి 2 వ పేజీలో...

# ప్రధాని సీటుకు నేను రెడీ!



## ప్రజాసేవే నా మార్గం

### అధికారమే బీజేపీ లక్ష్యం.. ట్రంప్ ముందు మోదీ మౌనం

### కాంగ్రెస్ నేత రాహుల్.. డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతులకు హాజరు


ప్రధాని పదవి చేపట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు రాహుల్ గాంధీ చెప్పారు. కాంగ్రెస్ సిద్ధాంతం అహింస, ప్రజాస్వామ్య విలువలపై ఆధారపడిందని, కానీ బీజేపీ రాజకీయాలు విభజన, హింస వైఖరిని ప్రోత్సహిస్తున్నాయని ఆయన విమర్శించారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీకి సంబంధించి.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతులు జరుగుతున్నాయి.

వికారాబాద్, మార్చి 2 (ఈవార్తలు): ఈ సమావేశాల ముగింపు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. అధికారమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తోందని, కాంగ్రెస్‌కు మాత్రం ప్రజాసేవ ప్రధానమని అన్నారు. ట్రంప్ ముందున మోదీ బలహీనంగా వ్యవహరిస్తున్నారని తరువాయి 2 వ పేజీలో...

# ఇరాన్‌ది తప్పే!

## యూఏఈ, సౌదీపై దాడులు సరికాదు

### ప్రధాని మోదీ.. గల్ఫ్ దేశాల అధినేతలకు ఫోన్



న్యూఢిల్లీ: అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గల్ఫ్ దేశాల అధినేతలతో అక్కడి భారతీయుల భద్రతపై చర్చలు జరిపారు. అదే సమయంలో గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులను మోదీ ఖండించారు. ఆయా దేశాధినేతలకు ఫోన్ చేసి వివరాలు కనుక్కున్నారు. సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ సల్మాన్‌తో ప్రధాని మోదీ ఫోన్లో మాట్లాడారు. బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాతో తరువాయి 2 వ పేజీలో...



# నేడు వైన్స్ బంద్

హైదరాబాద్, మార్చి 2 (ఈవార్తలు): హోలీ పండుగను పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్ నగరంలో మద్యం విక్రయాలపై పోలీసులు ఆంక్షలు విధించారు. నగరంలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా వైన్ షాపులు, బార్లు మూసివేయాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. తరువాయి 2 వ పేజీలో...

# అన్నారం కింద 'ఇసుక' కంపం!

### బరాజ్ పిల్లర్ల వద్ద అక్రమ తవ్వకాలు

### యథేచ్ఛగా నిబంధనల అతిక్రమణ

### పరీక్షల కోసం అంటూ అధికారుల వాదన

### ఆర్డర్ అడిగితే నీళ్లు నములుతున్న తీరు



కాళేశ్వరం, మార్చి 2 (ఈవార్తలు): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అన్నారం బరాజ్‌లో పిల్లర్ల వద్ద అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. బరాజ్ నుంచి 500 మీటర్లు అప్‌స్ట్రీం, డౌన్‌స్ట్రీం - 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

3.3.2026

మేషం: ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయడం మంచిది. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. ఆరోగ్య విషయాలలో వైద్య సంప్రదింపులు అవసరమవుతాయి. వృత్తి వ్యాపారాలలో నిర్ణయాలు కలిసిరావు. ఉద్యోగస్తులకు స్థానచలన సూచనలున్నాయి.

వృషభం: సన్నిహితుల నుండి అవసరానికి సహాయ సహకారాలు లభిస్తాయి. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. చేపట్టిన వ్యవహారాలలో కార్యసిద్ధి కలుగుతుంది. బంధుమిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలు అవుతాయి. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

మిథునం: ఇంటాబయట బాధ్యతలు మరింత చికాకు కలిగిస్తాయి. వ్యాపార వ్యవహారాలలో ఆలోచనలు స్థిరత్వం ఉండదు. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. సోదరులతో వివాదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి ఒత్తిడి పెరుగుతుంది.

కర్కాటకం: దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆదాయం బాగుంటుంది. సన్నిహితుల సహకారంతో చాలాకాలంగా పూర్తి కాని పనులను పూర్తి చేస్తారు. స్థిరాస్తి వివాదాలు ఒక కొలిక్కి వస్తాయి. వ్యాపార పరంగా కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. ఉద్యోగస్తులు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

సింహం: సోదరులతో స్థిరాస్తి వివాదాలు ఉంటాయి. దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చేసి నష్టపోతారు. నూతన ఋణప్రయత్నాలు చేస్తారు. చేపట్టిన కార్యక్రమాలలో అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు సహోద్యోగులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఇంటా బయట మీ నిర్ణయాలు అందరికీ నచ్చే విధంగా ఉంటాయి. కొన్ని వ్యవహారాలలో సన్నిహితుల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. వృత్తి వ్యాపారాలలో సమస్యలను అధిగమించి లాభాలు అందుకుంటారు. ఉద్యోగ వాతావరణం అనుకూలిస్తుంది.

తుల: చిన్ననాటి మిత్రులతో వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. కొన్ని వ్యవహారాలలో ప్రముఖుల నుండి కీలక సమాచారం అందుతుంది. కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. వ్యాపారపరంగా అనుకూలత పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలను అందుకుంటారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది.

వృశ్చికం: ఆదాయ మార్గాలు తగ్గుతాయి. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయడం మంచిది. వ్యాపారపరంగా తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. గృహ వాతావరణం చికాకుగా ఉంటుంది. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతల వల్ల విశ్రాంతి లభించదు.

ధనస్సు: ఇంటాబయట బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారమున భాగస్తులతో సమస్యలు ఉంటాయి. బంధువర్గంతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి పెరుగుతుంది. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉండదు. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది.

మకరం: కుటుంబ సభ్యులు నుండి ధనసహాయం లభిస్తుంది. గృహమున చిత్రవిచిత్రమైన సంఘటనలు చోటు చేసుకుంటాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. అవసరానికి సన్నిహితుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక అనుకూలత కలుగుతుంది. ఉద్యోగస్తులు ఉన్నత పదవులు పొందుతారు.

కుంభం: మంచి మాట తీరుతో అందరినీ ఆకట్టుకుంటారు. ఉద్యోగమున అధికారులతో చర్చలు ఫలిస్తాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతమవుతాయి. సోదరుల నుండి ధన సహాయం లభిస్తుంది. వృత్తి వ్యాపారములలో మరింత ఉత్సాహంగా పని చేసి లాభాలు అందుకుంటారు. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మీనం: దాయాదులతో ఆకస్మిక వివాదాలు కలుగుతాయి. దూరప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉన్నవి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపార ఉద్యోగాలు మరింత మందగిస్తాయి. సంతానం విద్యా విషయాలలో కొంత నిరాశ తప్పదు. చిన్ననాటి మిత్రులతో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

# చమురు మంటలు

**మొదటి పేజీ తరువాయి**

కొనసాగితే ముడి చమురు ధరలు మరింత పెరిగి రూ.9,500 నుంచి రూ.11,000 వరకు చేరవచ్చని మార్కెట్ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. సముద్ర మార్గాల్లో యుద్ధ తీవ్రత పెరిగి చమురు నౌకల రవాణాకు మరిన్ని అంతరాయాలు ఏర్పడితే, ధర రూ.14,000 వరకు పెరగవచ్చని భావిస్తున్నారు. కొందరు విశ్లేషకులు ఈ ధర 90 డాలర్లు లేదా 100 డాలర్లకు కూడా చేరవచ్చని అంచనా వేస్తున్నారు.


### హర్మ్యూజ్ జలసంధి ప్రభావం

హర్మూజ్ జలసంధిది ప్రపంచ చమురు సరఫరాలో కీలక పాత్ర. ఇరాన్ దీన్ని మూసేయడంతో అరబ్ దేశాల నుంచి ఆసియా దేశాలకు చమురు రవాణా పూర్తిగా ఆగిపోయింది. అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తుండటంతో, మరికొన్ని రోజుల పాటు రవాణా నిలిచిపోయే అవకాశం ఉంది. ఈ పరిస్థితి కొనసాగితే, చమురు ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని మార్కెట్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఈ చమురు ధరల పెరుగుదల సామాన్యుడిపై తీవ్ర భారం మోపుతుంది. సరుకు రవాణా ఛార్జీలు పెరిగితే, నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. ప్రపంచ ఆర్థిక పునరుద్ధరణకు ఇది ముప్పుగా మారుతుంది, ద్రవ్యోల్బణం మళ్లీ పెరిగే అవకాశం ఉంది. ఈ సంక్షోభంపై ఒపెక్ (ఆర్గనైజేషన్ ఆఫ్ పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్) స్పందిస్తూ తమ ఉత్పత్తిని పెంచుతామని ప్రకటించాయి. ఏప్రిల్ నుంచి రోజుకు 2 లక్షల బ్యారెళ్లకు పైగా అదనపు చమురు ఉత్పత్తి చేసి, గ్లోబల్ మార్కెట్ అవసరాలను తీరుస్తామని తెలిపాయి. కానీ యుద్ధ వాతావరణం కొనసాగితే ఇది సరిపోకపోవచ్చు.

### ఆరామ్‌కోపై ఇరాన్ దాడి

ఇరాన్ డ్రోన్లు సౌదీ అరేబియాలోని అతిపెద్ద ఆయిల్ రిఫైనరీపై విరుచుకుపడ్డాయి. తస్ తనారాలోని ఆరామ్‌కో ఆయిల్ రిఫైనరీని లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడులు భారీ నష్టాన్ని మిగిల్చాయి. డ్రోన్‌లతో జరిగిన ఈ దాడుల కారణంగా రోజుకు సుమారు 5.5 లక్షల బ్యారెళ్ల చమురు ఉత్పత్తి నిలిచిపోయింది. గల్ఫ్ ప్రాంతానికి ప్రధాన ఆదాయ మూలమైన ఆయిల్ సరఫరా తాత్కాలికంగా దెబ్బతింది.



# మార్కెట్లపై బాంబ్

**మొదటి పేజీ తరువాయి**

స్థిరపడింది. అలాగే నిఫ్టీ 50 ఇండెక్స్ ఇంట్రాడేలో 24,603 నుంచి 24,989 పాయింట్ల మధ్య కదలాడింది. చివరకు 313 పాయింట్ల నష్టంతో 24,865.70 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల విలువ ఒక్కరోజులోనే రూ.6.50 లక్షలు తగ్గి రూ.457 లక్షల కోట్లకు పడిపోయింది. అంటే ఇన్వెస్టర్లకు ఒక్కరోజులోనే రూ.6.50 లక్షల నష్టం వాటిల్లింది.

### రష్యాలో మార్కెట్ ర్యాలీ

రష్యాలో మాత్రం స్టాక్ మార్కెట్ గణనీయమైన ర్యాలీని నమోదు చేస్తోంది. రష్యా చమురు, గ్యాస్ కంపెనీలు భారీ లాభాలు ఆర్జిస్తున్నాయి. గల్ఫ్ ప్రాంతం నుంచి చమురు సరఫరా అంతరాయం కలిగితే, ప్రత్యామ్నాయ వనరుగా రష్యా చమురుకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందని పెట్టుబడిదారులు భావిస్తున్నారు. 2025లో రష్యా సుమారు 238 మిలియన్ టన్నుల చమురును ఎగుమతి చేసినట్లు అంచనా, అందులో దాదాపు 80 శాతం చైనా, భారతదేశాలకు వెళ్లినట్లు సమాచారం. అయితే, ఆర్‌బీసీ క్యాపిటల్ మార్కెట్స్ గ్లోబల్ కమోడిటీ స్ట్రాటజీ హెడ్ హెలిమా క్రాఫ్ట్ ప్రకారం, యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే గల్ఫ్ ప్రాంతంలోని చమురు నిల్వలు, సరఫరా వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే, రష్యన్ కంపెనీలు ఇప్పటికైతే లాభాలు పొందుతున్నాయి.

# అన్నారం కింద 'ఇసుక' కంపం!

**మొదటి పేజీ తరువాయి**

ఎలాంటి ఇసుక తవ్వకాలు చేపట్టరాదు. ఇసుక బుకింగ్ చేసుకున్న లారీలు నేరుగా నది లోపలికి అస్సలు వెళ్లకూడదు. కానీ, ఇసుక బకాసురులు యథేచ్ఛగా అక్రమంగా తోడేస్తున్నారు. సోషల్ మీడియాలో దీనికి సంబంధించిన చిత్రాలు, వీడియోలు వైరల్ అయ్యాయి. విషయం బయటికి పొక్కగానే, జేసీబీలు, లారీలను నది నుంచి తరలించి స్టాక్ యార్డ్ దగ్గర ఉంచారు. అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించగా.. వాళ్ల నుంచి వింత సమాధానాలు రావడం గమనార్హం. అన్నారం బరాజ్ పిల్లర్ల దగ్గర ఇసుక తవ్వకాలు చేయకూడదు అన్న నిబంధనలు ఉండగా ఎలా చేస్తున్నారు? అని అడగ్గా, సీడబ్ల్యూపీఆర్ఎస్ పరీక్షల కోసం పిల్లర్ల వద్ద తవ్వకాలు చేస్తున్నామని చెప్పడం అనుమానాలకు తావిచ్చింది. పరీక్షల కోసం తవ్వకాలు చేపడితే ఆ ప్రాంతంలో ప్రభుత్వ అధికారి ఉండాలి. పైగా, ప్రభుత్వ ఆర్డర్ కాపీ ఉండాలి. కానీ, అవేవీ లేనట్లు తెలుస్తోంది. అదీకాక, ఇసుక స్టాక్ యార్డుకు మినరల్ డీలర్ లైసెన్స్ లేకపోవడం గమనార్హం.

# ఇరాన్‌ది తప్పే!

**మొదటి పేజీ తరువాయి**

కూడా మాట్లాడారు. ఆ దేశాల్లోని భారతీయుల భద్రతపై వారితో చర్చించారు. సౌదీ అరేబియా, బహ్రెయిన్‌ల నాయకులతో చర్చల సందర్భంగా ఆ దేశాలపై ఇరాన్ దాడులను మోదీ ఖండించారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ప్రారంభమైనప్పటి నుంచి గల్ఫ్ దేశాల నాయకులతో ప్రధాని మోదీ నిత్యం సంప్రదింపులు జరుపుతున్నారు. ఆదివారం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో ఫోన్‌లో మాట్లాడారు. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ ఆల్ నహ్యాన్‌తో కూడా మాట్లాడారు. భారతీయుల క్షేమం కోసం కృషి చేస్తున్నందుకు ఆల్ నహ్యాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గల్ఫ్ దేశాల్లోని పరిస్థితిని సమీక్షించడానికి ప్రధానమంత్రి భద్రతా కేబినెట్ కమిటీ ఆదివారం సమావేశమైన సంగతి తెలిసిందే.

### నా ఫ్రెండ్ మోదీకి థ్యాంక్స్: నెతన్యాహు

పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలపై భారత ప్రధానమంత్రి మోదీతో చాలా సేపు మాట్లాడానని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు తెలిపారు. ఇరాన్‌పై పోరాటంలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా, యూదులకు మద్దతుగా నిలిచినందుకు నెతన్యాహు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు పశ్చిమాసియాలో తాజా పరిస్థితి గురించి ఇజ్రాయెల్ ప్రధానితో మాట్లాడానని, తాజా పరిణామాలపై భారత్ ఆందోళనలను తెలియజేశానని, పౌరులను రక్షించడం గురించి చర్చించనట్లు ప్రధాని మోదీ ఇప్పటికే ఎక్స్ లో వెల్లడించారు.

# ప్రధాని సీటుకు నేను రెడీ!

**మొదటి పేజీ తరువాయి**

విమర్శించారు. దేశ ప్రయోజనాల విషయంలో ధైర్యంగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ భవిష్యత్ కోసం.. దేశ ప్రజల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. దేశం కోసం.. అందరి కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఆకాంక్షించారు. గత 5 ఏళ్లుగా రాహుల్ గాంధీ చేసిన నిరంతర పోరాటాల ఫలితంగానే.. ఇప్పుడు ఆయన లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఎదిగారని గుర్తు చేశారు. దేశంలో నెలకొన్న అనేక సమస్యలపై రాహుల్ గాంధీ నిత్యం అలుపెరగని పోరాటం చేస్తున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి పీఠంపై కూర్చోబెట్టడమే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల తదుపరి లక్ష్యం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే తన రాజకీయ ప్రస్థానానికి సంబంధించి రేవంత్ రెడ్డి కీలక విషయాలను వెల్లడించారు. ఒక సామాన్య జడ్పీటీసీ స్థాయి నుంచి తాను ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యానని తన రాజకీయ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. గత 19 ఏళ్ల కాలంలోనే జడ్పీటీసీ నుంచి సీఎం స్థాయికి ఎదిగినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా, పార్టీలో రకరకాల పదవులు, బాధ్యతలను స్వీకరించి చాలా అనుభవాన్ని సంపాదించినట్లు వెల్లడించారు. తన రాజకీయ జీవితంలో ఎన్నడూ పైరవీలకు తావు లేదని స్పష్టం చేసిన రేవంత్.. ప్రజల సమస్యలపైనే గళం వినిపించడమే తన ప్రధాన పనిగా పెట్టుకుని, ఈ స్థాయికి వచ్చినట్లు వివరించారు. ప్రజల కోసం పోరాటం చేసి.. వారి పక్షాన నిలబడినందుకు తనపై ఎన్నో కేసులు నమోదు



చేసినట్లు గుర్తు చేశారు. కేసులు మాత్రమే కాకుండా, పరువు నష్టం దావాలు కూడా వేశారని తెలిపారు. అయినప్పటికీ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు సోనియా గాంధీపై ఉన్న ప్రజలకు ఉన్న నమ్మకమే ప్రధాన కారణమని వెల్లడించారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి.. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు కృషి చేయాలని హస్తం పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలపై పోరాటం చేయడమే మన మార్గమని.. రాహుల్ గాంధీని పీఎం చేయడమే మన గమ్యమని వ్యాఖ్యానించారు.

# గల్ఫ్ గజగజ

**మొదటి పేజీ తరువాయి**

ధరలు పెరిగే ప్రమాదం ఉంది. రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఈ భయాలతోనే ఇండియన్ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో కుప్పకూలాయి. గల్ఫ్ దేశాల గగనతలం డేంజర్ జోన్‌గా మారడంతో ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థలు దుబాయ్, ఖతార్, సౌదీ అరేబియాలకు వెళ్లే సుమారు 350 విమానాలను రద్దు చేశాయి. అలాగే, యూరప్, అమెరికా వెళ్లే విమానాలు ఇరాన్ గగనతలాన్ని దాటవేసి వేరే రూట్లలో వెళ్తుండటంతో ప్రయాణ సమయం దాదాపు 3 గంటలు పెరిగింది. దీనివల్ల విమానయాన సంస్థల ఆపరేషనల్ కాస్ట్ పెరిగి, టికెట్ ధరలు భారీగా పెరిగాయి. ఈ యుద్ధం ఎఫెక్ట్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాలపై డైరెక్ట్‌గా పడుతోంది. నిజామాబాద్, కరీంనగర్, కడప, గోదావరి జిల్లాల నుంచి లక్షలాది మంది కార్మికులు గల్ఫ్ దేశాల్లో (యూఏఈ, సౌదీ, ఓమన్) పనిచేస్తున్నారు. ఇప్పుడు అక్కడ యుద్ధ వాతావరణం నెలకొనడంతో వారి భద్రతపై ఇక్కడ కుటుంబ సభ్యులు టెన్షన్ పడుతున్నారు. ఒకవేళ పరిస్థితులు చేయిదాటితే, వీరంతా వెనక్కి రావాల్సి వస్తుంది. గల్ఫ్‌లో పరిస్థితిని తీవ్రంగా పరిగణిస్తున్న కేంద్ర ప్రభుత్వం, వాణిజ్య, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలతో అత్యవసర సమావేశాలు నిర్వహిస్తోంది. గల్ఫ్‌లో ఉన్న భారతీయుల కోసం ఎంబసీలు ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటు చేశాయి. రాబోయే రోజుల్లో ఆయిల్ సప్లైకి అంతరాయం కలగకుండా ప్రభుత్వం రష్యా, వెనిజులా లాంటి ప్రత్యామ్నాయ దేశాలతో చర్చలు జరిపే అవకాశం ఉంది.



# నేడు వైన్స్ బంద్

**మొదటి పేజీ తరువాయి**

సజ్జనార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల ప్రకారం.. హోలీ పండుగ రోజున ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల పరిధిలో మద్యం విక్రయాలు పూర్తిగా నిలిపివేయాల్సి ఉంటుంది. వైన్ షాపులతో పాటు కల్లు దుకాణాలు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లు కూడా ఈ సమయంలో మూసి ఉంచాలని కమిషనర్ స్పష్టం చేశారు. కేవలం హైదరాబాద్ మాత్రమే కాకుండా, స్థానిక పండుగ తేదీలను బట్టి (మంగళవారం లేదా బుధవారం) తెలంగాణలోని అన్ని జిల్లాల్లోనూ మద్యం దుకాణాల బంద్ అమలులో ఉంటుందని సమాచారం. ఈ ఆంక్షల నుంచి స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్‌లలోని బార్లకు పోలీసులు మినహాయింపు ఇచ్చారు. వీటిని సాధారణ నిబంధనల ప్రకారం నడుపుకోవచ్చని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఇరాన్‌ది తప్పే!

**మొదటి పేజీ తరువాయి**

జరిగి చారిత్రాత్మక ఒప్పందాలు కుదిరాయి. ఇందులో అత్యంత ముఖ్యమైనది సివిల్ న్యూక్లియర్ ఎనర్జీ రంగంలో కెనడా భారతదేశానికి యురేనియం సరఫరా చేయడానికి అంగీకారం తెలిపింది. అంతేకాదు స్మాల్ మాడ్యులర్ రియాక్టర్స్, అడ్వాన్స్ రియాక్టర్ల అభివృద్ధి చేయడానికి కూడా కెనడాతో సంయుక్తంగా పనిచేసేందుకు ఈ ఒప్పందంలో నిర్ణయం తీసుకున్నాయి. కాంప్రిహెన్సివ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్ (సీఈపీఏ) లో భాగంగా ఇరుదేశాలు వాణిజ్యం అలాగే పెట్టుబడులను పెంచేందుకు ఒప్పందాన్ని ఖరారు చేసుకున్నాయి. నిజానికి భారతదేశంలో ఉన్న అణు రియాక్టర్లలో యురేనియం అనేది అత్యవసరం అని చెప్పవచ్చు. మన దేశంలో యురేనియం ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది. దీంతో ఇతర దేశాల నుంచి శుద్ధికరించిన యురేనియం పైననే ఎక్కువగా ఆధార పడాల్సి ఉంది. మన దేశంలోనే అణు రియాక్టర్లు అన్నీ కూడా యురేనియం తోనే పని చేస్తాయి. భవిష్యత్తులో విద్యుత్ ఉత్పత్తికి అణు రియాక్టర్లు అత్యవసరం. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ఒప్పందం ఎంతో కీలకమైంది గా చెప్పవచ్చు. నిజానికి భారత్ కెనడా మధ్య ఇటీవల కాలంలో సిక్కు ఉగ్రవాదం విషయంలో భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. అయినప్పటికీ కూడా దౌత్య పరంగా సంప్రదింపులు సాగి ఆ విషయంలో ఇరుదేశాలు ఒక ఒప్పందానికి వచ్చాయి ముఖ్యంగా ఉగ్రవాదం విషయంలో ఇరుదేశాలు కలిసి పనిచేయాలని తీర్మానం తీసుకున్నాయి. క్రిటికల్ మినరల్స్ విషయంలో కెనడా, భారతదేశం ఒక అవగాహన ఒప్పందం కోసం కృషి చేస్తున్నాయి. ఇందులో మైనింగ్, ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాల అభివృద్ధి, స్థిరమైన సరఫరా గొలుసులను నిర్ధారించడం వంటి అన్ని అంశాలు ఉంటాయి. రక్షణ, అంతరిక్షం వంటి రంగాల్లో కూడా కార్నీ-మోదీ చర్చలలో భాగంగా ఉన్నాయి. రక్షణ పరిశ్రమను సంయుక్తంగా అభివృద్ధి చేయడంతో పాటు అంతరిక్ష రంగంలో, రిమోట్ సెన్సింగ్, ఉపగ్రహాలు వంటి రంగాలలో కలిసి పనిచేయడానికి ఇరు దేశాలు సంయుక్తంగా నిర్ణయం తీసుకుంటున్నాయి.

# ఎండల మంట తప్పదు!

## తెలుగు రాష్ట్రాలపై భానుడి ప్రతాపం.. ఉత్తర తెలంగాణలో 45 డిగ్రీలు దాటే చాన్స్

న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గట్టి హెచ్చరికలు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి నుంచి మే నెల వరకు (ఎంఏఎం సీజన్... మార్చి–ఏప్రిల్–మే) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండల తీవ్రత అత్యధికంగా ఉండనుందని స్పష్టం చేసింది. సాధారణంగా వేసవిలో ఉండే ఉష్ణోగ్రతల కంటే ఈసారి పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని, ముఖ్యంగా వడగాల్పుల రోజులు గణనీయంగా పెరుగుతాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు. ఇప్పటికే ఫిబ్రవరి నెలలో 2001 తర్వాత అత్యల్ప వర్షపాతం నమోదు కావడం, చలి తీవ్రత తక్కువగా ఉండటం రాబోయే కఠిన వేసవికి సంకేతాలని అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ వేసవిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వడగాల్పులు వీచే రోజుల సంఖ్య 3 నుంచి 15 రోజుల వరకు, కొన్ని ప్రాంతాల్లో అంతకంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా తెలంగాణలోని ఉత్తర జిల్లాలపై సూర్యుడు నిప్పులు చెరిగే ప్రమాదం ఉంది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మెదక్, సిద్దిపేట్, హనుమకొండ జిల్లాల్లో



పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. హైదరాబాద్‌లోనూ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల పైనే నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్సో న్యూట్రల్ పరిస్థితులు ఏర్పడుతుండటంతో వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తీవ్రమైన ఎండల కారణంగా వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారు బయట తిరగడం తగ్గించుకోవాలని ఐఎండీ సూచించింది. పెరిగే ఉష్ణోగ్రతలు ప్రజల ఆరోగ్యంపైనే కాకుండా నీటి వనరులు, విద్యుత్ డిమాండ్‌పైనా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రభుత్వ యంత్రాంగం, స్థానిక సంస్థలు నీటి ఎద్దడి తలెత్తకుండా, వడదెబ్బ మరణాలు సంభవించకుండా ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. మరోవైపు పొరుగున ఉన్న తమిళనాడులోనూ పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. అక్కడ కూడా మార్చి నుంచి మే వరకు మూడు నెలల పాటు తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఐఎండీ తెలిపింది. ముఖ్యంగా ఆ రాష్ట్ర ఉత్తర జిల్లాల్లో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు కానున్నాయి. అయితే, కోమరిన్ ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో పశ్చిమ కనుమల ప్రాంతాల్లోని జిల్లాల్లో మాత్రం రాబోయే రెండు నుంచి ఐదు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇది స్థానికులకు కాస్త ఉపశమనం కలిగించవచ్చని వాతావరణ కేంద్రం పేర్కొంది. మిగిలిన ప్రాంతాల్లో మాత్రం పొడి వాతావరణంతో పాటు, చెన్నై వంటి నగరాల్లో ఉదయం వేళల్లో పొగమంచు కనిపించే అవకాశం ఉంది.

## చంద్రగ్రహణం ఇలా..

**భారత్‌లో ఎప్పుడు, ఎంతసేపు కనిపిస్తుంది?**


*మంగళవారం మధ్యాహ్నం 3.20 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6.48 గంటలకు వీడుతుంది. భారత్‌లో సాయంత్రం 6.20 నుంచి సుమారు 27 నిమిషాలు కనిపిస్తుంది. అండమాన్, ఈశాన్య రాష్ట్రాల్లో మినహా దేశమంతా సంపూర్ణ గ్రహణం వీక్షించవచ్చు. తదుపరి సంపూర్ణ చంద్రగ్రహణం 2028 డిసెంబరు 31న చూడొచ్చు.*

## నేడు తిరుమల ఆలయం మూసివేత

తిరుమల, మార్చి 2 (ఈవార్తలు): చంద్రగ్రహణం కారణంగా మంగళవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ తలుపులను మూసివేస్తున్నట్లు టీటీడీ అధికారులు ప్రకటించారు. గ్రహణ ప్రభావం కారణంగా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఆలయాన్ని పూర్తిగా మూసివేస్తారు. ఈ నేపథ్యంలో రేపు జరగాల్సిన వీఐపీ బ్రేక్ దర్శనాలు, ఆర్జిత సేవలు మరియు ప్రత్యేక ప్రవేశ దర్శనాలను అధికారులు పూర్తిగా రద్దు చేశారు. ఈరోజు రాత్రి వరకు మాత్రమే భక్తులను క్యూలైన్లలోకి అనుమతించనున్నారు. అలాగే తిరుపతిలో జారీ చేసే రేపటి కోటా సర్వదర్శనం టోకెన్లను కూడా రద్దు చేస్తున్నట్లు టీటీడీ స్పష్టం చేసింది. మరోవైపు, తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లన్నీ నిండిపోయి, భక్తులు వెలుపల ఉన్న క్యూలైన్ల వరకు వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు స్వామివారి సర్వదర్శనం లభించడానికి సుమారు 12 గంటల సమయం పడుతోంది. నిన్న ఒక్కరోజే 83,122 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,054 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారి హుండీ ఆదాయం 4.49 కోట్ల రూపాయలు. గ్రహణం వీడిన అనంతరం ఆలయ శుద్ధి, ఇతర సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించి, రాత్రి 7.30 గంటల తర్వాతే భక్తులను తిరిగి దర్శనానికి అనుమతిస్తారు.

## 600 కోట్ల ప్రభుత్వ భూమి సేఫ్

**గంధంగూడలో 6.30 ఎకరాల స్థలం హైడ్రా స్వాధీనం**



హైదరాబాద్, మార్చి 2 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పడిన హైడ్రా మరో భారీ ఆపరేషన్ చేపట్టింది. ఐటీ కారిడార్‌కు ఆనుకుని ఉన్న గంధంగూడ ప్రాంతంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల చెర నుంచి విడిపించింది. సుమారు రూ.600 కోట్ల విలువ చేసే 6.30 ఎకరాల స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం గంధంగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 86/పిలో ఉన్న 6.30 ఎకరాల ప్రభుత్వ భూమిని సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం గతంలోనే జలమండలికి కేటాయించింది. అయితే, ఈ విలువైన స్థలంపై కన్నేసిన కొందరు అక్రమార్కులు రకరకాల పేర్లతో ఆక్రమణలకు పాల్పడుతూ వచ్చారు. అంతేకాకుండా, ఆ స్థలంలో అనధికారికంగా షెడ్లను కూడా నిర్మించి కబ్జా చేశారు. ఈ విషయంపై జలమండలి అధికారుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో పక్కాగా సర్వే నిర్వహించింది. ఇది ప్రభుత్వ భూమేనని నిర్ధారించుకున్న అనంతరం, అక్కడ వెలసిన అక్రమ నిర్మాణాలను, షెడ్లను అధికారులు కూల్చివేశారు. ఆక్రమణలన్నీ తొలగించిన తర్వాత మొత్తం 6.30 ఎకరాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో ఆక్రమణలకు తావులేకుండా ఇది ప్రభుత్వ స్థలం అని స్పష్టం చేస్తూ హైడ్రా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది.

## బాల్క సుమన్‌కు బెయిల్

మంచిర్యాల, మార్చి 2 (ఈవార్తలు): బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు మంచిర్యాల జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి ఘటనలో ఆయనతో పాటు మరో ముగ్గురికి కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. గత నెలలో జరిగిన మున్సిపల్ ఎన్నికల అనంతరం క్యాతనపల్లిలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఫిబ్రవరి 18న మంత్రి వివేక్ కాన్వాయ్‌పై జరిగిన దాడి కేసులో బాల్క సుమన్ అరెస్టయ్యారు. ప్రస్తుతం బాల్క సుమన్ ఆదిలాబాద్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కోర్టు ఆయనకు రూ.25 వేల పూచీకత్తుతో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ప్రతి ఆదివారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలని ఆదేశించింది. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఎక్కువ మంది విజయం సాధించారు. దీంతో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక పలుమార్లు వాయిదాపడిన నేపథ్యంలో ఉద్రిక్తతలు తలెత్తాయి.

## దుబాయ్‌లో చిక్కుకున్న తుమ్మల

**క్షేమంగా ఉన్నానని వెల్లడి**



దుబాయ్: అమెరికా, ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య రేగిన భీకర పోరు ప్రపంచ దేశాల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడుతుండటంతో గల్ఫ్ దేశాలన్నీ యుద్ధ క్షేత్రాలుగా మారాయి. ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. తన కుటుంబ సభ్యుల్లో ఒకరు అనారోగ్యానికి గురి కావడంతో వారిని పరామర్శించేందుకు ఐదు రోజుల క్రితమే ఆయన దుబాయ్ వెళ్లారు. అయితే ఇరాన్ తన క్షిపణి దాడుల లక్ష్యాన్ని యూఏఈ, కువైట్, ఖతార్ వంటి దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, విమానాశ్రయాల వైపు మళ్లించడంతో అక్కడ యుద్ధ వాతావరణం నెలకొంది. భద్రతా కారణాల దృష్ట్యా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అక్కడి ప్రభుత్వం తాత్కాలికంగా మూసివేయడంతో పాటు అన్ని విమాన సర్వీసులను రద్దు చేసింది. ప్రస్తుతం దుబాయ్‌పై ఇరాన్ దాడుల నేపథ్యంలో అక్కడి జనజీవనం పూర్తిగా స్థంభించిపోయింది. విమానాల రాకపోకలు నిలిచిపోవడంతో తుమ్మల నాగేశ్వరరావు తన కుటుంబంతో కలిసి అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆయన సురక్షితంగానే ఉన్నప్పటికీ, విమానాశ్రయ అధికారులు క్లియరెన్స్ ఇచ్చే వరకు స్వదేశానికి తిరిగి రావడం సాధ్యం కాదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తుమ్మల స్పందిస్తూ... తాను సురక్షితంగానే ఉన్నానని తెలిపారు. విమాన సర్వీసులు ప్రారంభమైన వెంటనే హైదరాబాద్ కు బయల్దేరుతానని చెప్పారు.

## శబరిమల ఆలయంలోకి మహిళలొద్దు!

**అఫిడవిట్ దాఖలు చేయనున్న దేవస్వమ్ బోర్డు**

తిరువనంతపురం: శబరిమల ఆలయంలోకి మహిళలందరికీ ప్రవేశం కల్పిస్తూ 2018లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పును ట్రావెన్ కోర్ దేవస్వమ్ బోర్డు మొదటి నుంచి వ్యతిరేకిస్తోంది. ఈ తీర్పును సమీక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టిన నేపథ్యంలో అఫిడవిట్ దాఖలు చేయాలని ట్రావెన్ కోర్ దేవస్వమ్ బోర్డు నిర్ణయించింది. శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆచారాలను, సంప్రదాయాలను కాపాడేందుకు ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు ఈ కీలక నిర్ణయం తీసుకున్నది. ఆలయంలో దశాబ్దాలుగా కొనసాగుతోన్న సంప్రదాయాన్ని తాము సమర్థిస్తున్నామని, మహిళల ప్రవేశంపై అదే ఆచారం కొనసాగాలని బోర్డు తెలిపింది. మార్చి 14వ తేదీ లోగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని బోర్డు సమావేశంలో నిర్ణయించారు. మహిళల ప్రవేశానికి సంబంధించి పాత సంప్రదాయాన్నే కొనసాగించాలనే విషయంలో బోర్డులో ఎవరికీ భిన్నాభిప్రాయాలు లేవని బోర్డు సభ్యులు తెలిపారు. దేవాలయం పవిత్రతను, పురాతన సంప్రదాయాలను కాపాడటమే బోర్డు ప్రాథమిక బాధ్యత అన్నారు.

## పాక్‌కు నిద్రలేని రాత్రులు

**ఆఫ్ఘనిస్థాన్ వైమానిక దాడులు**

**క్వెట్టా, ఖైబర్ పఖ్తుంఖ్వా స్థావరాలు లక్ష్యం**

కాబూల్: పాకిస్థాన్‌లోని కీలక సైనిక స్థావరాలపై తమ వైమానిక దళం దాడులు నిర్వహించిందని ఆఫ్ఘనిస్థాన్ రక్షణ శాఖ ప్రకటించింది. భారతదేశం ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పుడు రావల్పిండిలోని నూర్ ఖాన్ వైమానిక స్థావరం ధ్వంసమైంది. దీనిని పాకిస్థాన్ రిపేర్ చేసుకుంటోంది. ఇప్పుడు ఆఫ్ఘనిస్థాన్ ఆ విమానాశ్రయాన్ని కూడా లక్ష్యంగా చేసుకుంది. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య గత కొన్నిరోజులుగా ఉద్రిక్తతలు కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పాక్ కీలక సైనిక స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఆఫ్ఘనిస్థాన్ వెల్లడించింది. నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌తో పాటు క్వెట్టాలోని 12వ కార్ప్స్ ప్రధాన కార్యాలయం, ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పలు కీలకమైన పాక్ సైనిక స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. తమ దేశంలోని వివిధ ప్రాంతాలపై పాకిస్థాన్ వైమానిక దాడులు నిర్వహించిందని ఆందోళన వ్యక్తం చేసింది. పాకిస్థాన్ సైనిక చొరబాట్లకు ప్రతీకారంగా ఈ దాడులు నిర్వహించినట్లు ఆఫ్ఘనిస్థాన్ రక్షణ శాఖ ప్రకటించింది. తాము చేసిన దాడిలో నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌తో పాటు పలు సైనిక స్థావరాలు దెబ్బతిన్నాయని తెలిపింది. మరోవైపు, ఆఫ్ఘనిస్థాన్‌లోని జలాలాబాద్‌లో పాకిస్థాన్ యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు తాలిబన్లు తెలిపారు. విమాన పైలట్ తమ అదుపులో ఉన్నట్లు వెల్లడించింది.

## వరంగల్‌లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం!

**ధర్మసాగర్ మండలంలో 30 ఎకరాల భూమి గుర్తింపు**

వరంగల్, మార్చి 2 (ఈవార్తలు): తెలంగాణను దేశ క్రీడా రాజధానిగా మార్చాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా వరంగల్ క్రికెట్ అభిమానుల చిరకాల స్వప్నాన్ని నెరవేర్చేందుకు అడుగులు ముందుకు వేస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. సీఎం రేవంత్ రెడ్డి దీనిపై సానుకూలంగా స్పందించినట్లు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇటీవల కడియం శ్రీహరి నేతృత్వంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి, జిల్లాలో క్రికెట్ స్టేడియం ఆవశ్యకతను వివరించారు. యువత ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకున్న సీఎం, వెంటనే అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు స్టేడియం నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించారు. ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల శివారులో 163వ నంబర్ జాతీయ రహదారికి సమీపంలో ఉన్న కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా)కు చెందిన 30 ఎకరాల భూమిని దీనికోసం ప్రతిపాదించారు. ఈ వివరాలతో కూడిన ఫైల్‌ను రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌కు



అందజేశారు. ప్రస్తుతం ఈ ఫైల్ ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఇటీవల ప్రకటించిన 'తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ 2025'లో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తోంది. 2036 ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించడమే ప్రధాన లక్ష్యంగా ఈ పాలసీని రూపొందించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ గచ్చిబౌలిలో 200 ఎకరాల్లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు 119 నియోజకవర్గాల్లో మినీ స్టేడియాలు, ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్కూల్ నిర్మించాలని నిర్ణయించారు. వరంగల్‌లో స్టేడియం నిర్మాణానికి త్వరలోనే అనుమతులు లభించే అవకాశం ఉందని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇది కార్యరూపం దాల్చితే ఓరుగల్లు కీర్తి మరింత పెరగడమే కాకుండా అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చే అవకాశం లభిస్తుంది. ఇది స్థానిక క్రీడాకారులకు గొప్ప ప్రోత్సాహాన్ని అందిస్తుందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇతరులకు ఇబ్బంది కలిగించొద్దు: సజ్జనార్

హైదరాబాద్, మార్చి 2 (ఈవార్తలు): హైదరాబాద్‌లో హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ హెచ్చరించారు. సోమవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. పండుగ నేపథ్యంలో నగరంలో పలు ఆంక్షలు విధించారు. ఎవరికైనా ఇష్టం లేకపోతే, లేని వారిపై బలవంతంగా రంగులు చల్లడం, పాదచారులు, వాహనాలపై రంగులు లేదా రంగు నీళ్లు చల్లడం నిషేధమని స్పష్టం చేశారు. ప్రస్తుతం రంజాన్ మాసం కొనసాగుతున్నందున ముస్లింల ప్రార్థనలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో



అదనపు భద్రత ఏర్పాటు చేయాలని, పీస్ కమిటీలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నగరవ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్, బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఆకతాయిలపై షీ టీమ్స్ ప్రత్యేక నిఘా ఉంచుతాయని తెలిపారు. హోలీ వేడుకల్లో డీజేలకు అనుమతి లేదని, రసాయన రంగులకు బదులుగా సహజ రంగులు వాడాలని సీపీ సూచించారు. యువకులు రోడ్లపై గుంపులుగా తిరుగుతూ న్యూసెన్స్ చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలు, బార్లు, కల్లు కాంపౌండ్లు మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఢిల్లీలో తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్

న్యూఢిల్లీ: ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఇరాన్ ప్రతిదాడులు చేపట్టింది. దీంతో పశ్చిమాసియా అల్లకల్లోలంగా మారింది. అమెరికాతో చర్చల ప్రసక్తి లేదని, ఈ యుద్ధాన్ని తాము ప్రారంభించలేదని, ఇజ్రాయెల్ అధికార కాంక్ష కారణంగా ఇది ప్రారంభమైందని ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. యుద్ధం ఆపేందుకు మధ్యవర్తులతో చర్చలకు తాము సుముఖంగా లేమని ఇరాన్ స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. పశ్చిమాసియా దేశాల్లోని తెలంగాణ పౌరుల సహాయం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దీనిని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. విదేశాంగ శాఖ, సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో తెలంగాణ భవన్ అధికారులు ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. ఆయా దేశాల్లోని పౌరులకు ఇబ్బందికర పరిస్థితి తలెత్తితే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని కోరారు. 24 గంటలు అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లను అధికారులు తెలిపారు. హెల్ప్ లైన్ నెంబర్లు ఇవే – 871999044, 9958322143, 9910014749, 9643723157.

## పెద్దల ఇళ్లను పడగొడతాం

**కాంగ్రెస్ సర్కార్‌కు బండి వార్నింగ్**



కరీంనగర్, మార్చి 2 (ఈవార్తలు): మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం పేదల ఇళ్లను కూల్చివేయడంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బఫర్ జోన్, ఎఫ్టీఎల్ సాకుతో సామాన్యుల ఇళ్లను కూలిస్తే, తాము అధికారంలోకి వచ్చాక పెద్దల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తామని హెచ్చరించారు. గాంధీ విగ్రహం ఏర్పాటు చేసే సాకుతో వందలాది కుటుంబాలను రోడ్డున పడేయడం గాంధీ సిద్ధాంతాలకే విరుద్ధమని మండిపడ్డారు. గతంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి చెందిన కాలేజీల కూల్చివేత విషయంలో విద్యార్థుల పరీక్షలను సాకుగా చూపిన ప్రభుత్వం... ఇప్పుడు ఖమ్మంలో కూల్చివేతలు చేస్తున్నప్పుడు ఇంటర్ విద్యార్థుల పరీక్షలు, భవిష్యత్తు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. ఒవైసీని ప్రసన్నం చేసుకోవడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని బండి సంజయ్ ఆరోపించారు. హిందువులను జైల్లో వేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని, దీనికి ప్రజలంతా ఏకమై బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ నేతలు తలుచుకుంటే కాంగ్రెస్ నాయకులు బయట తిరగలేరని, ఇప్పటికే ఆ పార్టీలో అంతర్యుద్ధం మొదలైందని ఎద్దేవా చేశారు. ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనపై స్పందిస్తూ... ఆయన కేవలం 'మూటల' కోసమే రాష్ట్రానికి వచ్చారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలన గాలికి వదిలేసి, ప్రజల ఆస్తులను ధ్వంసం చేస్తూ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పేదల పక్షాన బీజేపీ పోరాటం ఆగదని, అవసరమైతే బుల్డోజర్లతోనే సమాధానం చెబుతామని బండి సంజయ్ అన్నారు.

# కౌన్సిలర్ భర్త హంగామా

**వ్యాపారులపై దౌర్జన్యం**

**దుకాణాలు తగులబెడతానని బెదిరింపులు**

**జగిత్యాల రైతు బజార్‌లో ఘటన**



జగిత్యాల టౌన్, మార్చి 2 (ఈవార్తలు): శాంతియుతంగా సాగే జగిత్యాల రైతు బజార్ ఒక్కసారిగా ఉద్రిక్తతకు వేదికైంది. అధికార గర్వమో లేక మద్యం మత్తులో వచ్చిన మొండితనమో తెలియదు కానీ, 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి భర్త ఏసీఎస్ రాజు చేసిన హంగామాతో సామాన్య రైతులు, వ్యాపారులు బెంబేలెత్తిపోయారు. లైసెన్సుల పేరుతో వ్యాపారులను వేధిస్తూ, వారి పొట్ట కొట్టే ప్రయత్నం చేయడం స్థానికంగా కలకలం రేపింది.

**ఎమ్మెల్యే పేరుతో బెదిరింపులు?**

సోమవారం రైతు బజార్‌లోకి ప్రవేశించిన ఏసిఎస్ రాజు, అక్కడి వ్యాపారులను లైసెన్సులు చూపించాలని డిమాండ్ చేస్తూ గొడవకు దిగారు. 'నేను స్థానిక కౌన్సిలర్ ప్రతినిధిని.. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పంపితేనే ఇక్కడికి వచ్చాను' అంటూ వింత వాదనకు తెరలేపారు. మద్యం మత్తులో ఉన్న ఆయన, రైతులు విక్రయానికి ఉంచిన కూరగాయలను పక్కకు తోసిపడేస్తూ వీరంగం సృష్టించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

**హింసాత్మక హెచ్చరికలు**

అక్కడితో ఆగకుండా, 'మీ దుకాణాలు ఖాళీ చేయండి.. ఇక్కడ నేను క్యాంటీన్ పెడతాను' అంటూ హుకుం జారీ చేశారు. వ్యాపారులు ఎదురుతిరగడంతో మరింత రెచ్చిపోయిన రాజు.. దుకాణాలను తగులబెడతానని, మిమ్మల్ని కోసిపారుస్తానని అత్యంత భయంకరమైన భాషలో బెదిరింపులకు దిగారు. కాయకష్టం చేసుకునే రైతులను ఇలా నడిబజార్లో అవమానించడంపై వ్యాపార వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

**పోలీసుల రంగప్రవేశం.. కేసు నమోదు**

ఈ భయానక వాతావరణంపై సమాచారం అందుకున్న జగిత్యాల పట్టణ పోలీసులు తక్షణమే స్పందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కౌన్సిలర్ భర్త ఏసీఎస్ రాజుతో పాటు ఆయనకు సహకరించిన రాహుల్ అనే మరో యువకుడిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పోలీసులు విచారణను వేగవంతం చేశారు.




# గురువులను మరిచిన విద్యా కమిషన్

**తెలంగాణ చరిత్ర రచయిత వీ ప్రకాశ్**

హైదరాబాద్, మార్చి 2 (ఈవార్తలు): విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని విద్యా కమిషన్ ప్రభుత్వానికి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చిందని.. అయితే రాబోయే తరానికి చదువులు చెప్పే గురువులే లేకుండా పోతున్నారన్న విషయాన్ని ఆ విద్యా కమిషన్ మరిచిపోయిందని తెలంగాణ చరిత్ర రచయిత, జలవనుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్ ఎద్దేవా చేశారు. ఆదివారం రాత్రి వెంకటేశ్వర కాలనీ సరూర్‌నగర్‌లోని శ్రీనిధి గ్లోబల్ హైస్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉన్నత చదువులు చదివినవారంతా విదేశాలకు, సాఫ్ట్‌వేర్ రంగాలవైపు వెళ్తున్నారని, ఉపాధ్యాయ రంగాన్ని ఎంచుకొనేందుకు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ విద్యారంగంలో నిష్ణాతులైన ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని అన్నారు. నగరాల్లో 70 శాతం మంది విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లలోనే చదువుతున్నారని తెలిపారు. అనంతరం.. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలను తిలకించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, సర్దార్ పుట్టం పురుషోత్తంరావు, ఈ-అబ్యాస్ అకాడమీ చైర్మన్ డాక్టర్ పని పవన్, పాఠశాల చైర్మన్ మంగళారపు లక్ష్మణ్, డైరెక్టర్ రాహుల్ రాజ్, ఆకుల భవానీ, మహాలక్ష్మి టెంపుల్ చైర్మన్ ఆకుల అమరేందర్, బీర బాలకృష్ణ, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# చెరువు నింపి మత్స్యకారులను కాపాడాలె!

మల్యాల, మార్చి 2 (ఈవార్తలు): చేపల పెంపకం కోసం మల్యాల మత్తడి చెరువులో నీళ్లు నింపి, మత్స్యకారులను కాపాడాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ- జేఏసీ మల్యాల మత్స్య పారిశ్రామిక సంఘం కోరింది. సోమవారం ప్రజావాణిలో ఎమ్మార్వోను కలిసి వినతి పత్రం అందజేశారు. పదేళ్ల కిందట ముత్యంపేట వరద కెనాల్ వద్ద తూము నిర్మాణం చేసినా,చెరువులోకి పైప్‌లైన్ ఇవ్వలేదని తెలిపారు. వర్షం నీళ్లతో చెరువు నిండితేనే చేపల పెంపకం సాధ్యమవుతోందని, వేసవి వచ్చేసరికి చెరువు ఎడారిలా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 200 మత్స్యకారుల కుటుంబాలకు ఈ చెరువే జీవనోపాధి అని వెల్లడించారు. పైగా, కొందరు చెరువు ఎఫ్టీఎల్ పరిధిలోని భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదు చేశారు. ఎమ్మార్వోను కలిసినవారిలో సంఘం బీసీ-ఎస్సీ జిల్లా అధ్యక్షుడు మనాల కిషన్, జిల్లా ఇంచార్జి దువ్వాక శివ మహారాజ్, జేఏసీ కార్యదర్శి సల్లురి రాజు గౌడ్, మత్స్య సంఘం అధ్యక్షుడు కొండూరి భూమయ్య, రమేశ్, రవి, నర్సయ్య, మహేశ్, మల్లేశ్, ప్రశాంత్, నవీన్, రవి, గంగాధర్, లక్ష్మీరాజం, శ్రీనివాస్, రాజేందర్, రాజేశ్, రాజయ్య, నారాయణ ఉన్నారు.



# రాంపూర్ పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల

మల్యాల, మార్చి 2 (ఈవార్తలు): రైతుల పంట పొలాలకు నీరందించే క్రమంలో జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ పంప్‌హౌస్ వద్ద కాంగ్రెస్ నాయకులు గంగమ్మ తల్లికి పూజలు చేశారు. మల్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొంగ ఆనంద రెడ్డి, మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్, కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్ నేతృత్వంలో.. సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. గంగమ్మ తల్లికి పూజలు చేసి, కుంకుమ, పూలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# కలెక్టర్ మేడం.. నాకు చావే దిక్కు!

**అంగవైకల్యమే నాకు శాపమా?.. దివ్యాంగుడు ఓదెల నరేశ్ ఆవేదన**

**కరీంనగర్ కలెక్టరేట్ ముందు నిరసన**

కరీంనగర్, మార్చి 2 (ఈవార్తలు): అంగవైకల్యంతో బాధపడుతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తికి చెందిన దివ్యాంగుడు ఓదెల నరేశ్ కన్నీరుమున్నీరయ్యాడు. నిరుపేదనైన తనకు ఆసరా లేదని, తన కుటుంబం దిక్కుతోచని స్థితిలో జీవనం కొనసాగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కరీంనగర్ కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేసిన నరేశ్.. తనకు ఉన్నదాంట్లో సేవా కార్యక్రమాలు చేశానని, ఇప్పుడు కుటుంబం రోడ్డున పడ్డా ఆదరించేవారేలేరని తెలిపాడు. డిగ్రీ, ఐటీఐ చేసిన తనకు దారి చూపాలని ఎన్నో సార్లు కలెక్టర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలను కలిశానని, ప్రతి చోటా.. తనకు గెంటివేత పరిస్థితులే ఎదురయ్యాయని విలపించాడు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తనకు ఉపాధి కల్పించాలని వేడుకున్నాడు. లేకపోతే తనకు చావే శరణ్యం అని గోడు వెల్లబోసుకున్నాడు.

# మాట నిలబెట్టుకున్న సర్పంచ్

మల్యాల, మార్చి 2 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బొట్ల జయ ప్రసాద్.. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. గ్రామంలో కోతుల బెడద నుంచి ప్రజలకు శాశ్వత విముక్తి కల్పించడానికి తన సొంత ఖర్చులతో బోనును తయారు చేయించి, సోమవారం ఈవోకు అందజేశారు. నివాసాల్లోకి వచ్చే కోతులను బంధించి, బోనులో అటవీ ప్రాంతాలకు తరలించనున్నట్లు ఆమె తెలిపారు. హామీ నెరవేర్చిన సర్పంచ్‌కు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికైనా, కోతులు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# గల్ఫ్‌లో చిక్కుకున్నోళ్లను తీసుకురండి

**ఏపీ అధికారులకు చంద్రబాబు ఆదేశం**



అమరావతి, మార్చి 2 (ఈవార్తలు): మధ్య ప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన ఏపీ వాసులను క్షేమంగా వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్, ఏపీ ఎన్ఆర్‌టీఎస్ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, కువైట్ వంటి దేశాల్లో చిక్కుకున్న ప్రయాణికులను స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ శాఖతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సీఎం సూచించారు. యుద్ధం, విమాన సర్వీసుల రద్దు కారణంగా ఇబ్బందులు పడుతున్న వారిని వెంటనే గుర్తించి సహాయం అందించాలన్నారు. ఆయా దేశాల్లోని భారతీయ ఎంబసీలతో నిరంతరం టచ్‌లో ఉంటూ సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆర్టీజీఎస్, ఏపీ ఎన్ఆర్‌టీఎస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గల్ఫ్ దేశాల్లోని తెలుగు వారు ఎవరూ ఆందోళన చెందవద్దని, విమానాశ్రయాలు తిరిగి తెరుచుకుని సర్వీసులు ప్రారంభమయ్యే వరకు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని చంద్రబాబు సూచించారు. ఏపీ ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏపీ ఎన్ఆర్‌టీఎస్ కోఆర్డినేటర్ల ద్వారా అవసరమైన వారికి తాత్కాలిక వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని రాష్ట్ర ఎన్నారై శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బాధితుల కోసం ప్రభుత్వం 24 గంటల పాటు పనిచేసే ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటు చేసింది.

**హెల్ప్‌లైన్ నెంబర్లు:**

**ఫోన్: 0863-2340678**

**వాట్సాప్: 85000 27678**

# విచారణకు హాజరుకావాల్సిందే

**సునీల్ నాయక్‌కు హైకోర్టు ఆదేశం**

అమరావతి, మార్చి 2 (ఈవార్తలు): సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌కు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఊరట లభించలేదు. కస్టోడియల్ టార్చర్ కేసుకు సంబంధించి దాఖలైన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 5 నుంచి 9వ తేదీ మధ్య విచారణ అధికారి ఎదుట హాజరై, విచారణకు పూర్తిగా సహకరించాలని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, 2021లో అప్పటి ఎంపీ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో సునీల్ నాయక్ పేరు కూడా ఉంది. ఆ సమయంలో ఆయన ఏపీ సీఐడీ విభాగంలో ఉన్నారు. ఈ కేసులో తనను అరెస్టు చేసే అవకాశం ఉందన్న ఆందోళనతో ఆయన హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, సునీల్ నాయక్‌కు కొన్ని షరతులు విధించింది. నిర్దేశించిన ఐదు రోజుల్లోగా విచారణ అధికారి ముందుకు వచ్చి, వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని ఆదేశించింది. విచారణకు ఆయన సహకరించే తీరును బట్టి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పరోక్షంగా సూచించింది. ప్రస్తుతం సునీల్ నాయక్ బీహార్‌లో ఫైర్ సర్వీసెస్ విభాగంలో ఐజీగా పనిచేస్తున్నారు.

# డీఎంకే తరపున రోజా ప్రచారం

**చంద్రబాబుపై తీవ్ర విమర్శలు**

చెన్నై: తమిళనాడు శాసనసభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. అన్ని రాజకీయ పార్టీలు ప్రచారంలో తలమునకలయ్యాయి. ఈ నేపథ్యంలో, తమిళ రాజకీయాల్లో వైసీపీ ఫైర్‌బ్రాండ్, మాజీ మంత్రి ఆర్కే రోజా సందడి చేశారు. ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ పుట్టినరోజు (మార్చి 1) వేడుకల్లో పాల్గొన్న ఆమె, రాబోయే ఎన్నికల్లో డీఎంకేకు మద్దతుగా తన గళాన్ని వినిపించారు. ఈ సందర్భంగా స్టాలిన్ అందిస్తున్న అద్భుతమైన సంక్షేమ పథకాలను రోజా ఆకాశానికెత్తారు. ముఖ్యంగా తమిళనాడులో మహిళల ఆర్థిక భద్రత కోసం ప్రతినెలా వారి ఖాతాల్లో నేరుగా వెయ్యి రూపాయలు జమ చేయడం వంటి పథకాలు మహిళా సాధికారతకు నిదర్శనమని ఆమె కొనియాడారు. ఇదే తరుణంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఆమె తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏపీలో మహిళలకు నేరుగా నగదు అందిస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ప్రతిపక్షాలకు భయం పట్టుకుందని రోజా వ్యాఖ్యానించారు. ఇటీవల మహిళల ఖాతాల్లో ఒకేసారి ఐదు వేల రూపాయలు జమ చేయడంతో విపక్ష నేతలకు ఏం చేయాలో పాలుపోవడం లేదని ఎద్దేవా చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని తాను పూర్తిస్థాయిలో సమర్థిస్తున్నానని, దీనివల్ల కూలి పనులకు వెళ్లే పేద మహిళలకు, విద్యార్థులకు ఎంతో ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇంతటి గొప్ప మనసున్న నాయకుడిని తమిళ ప్రజలు భారీ మెజారిటీతో మళ్లీ గెలిపించుకోవాలని, సంక్షేమ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధికి ప్రతిఫలంగా స్టాలిన్‌కు ఓటు వేసి రుణం తీర్చుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఒకవైపు ఏపీ రాజకీయాల్లో చురుగ్గా ఉంటూనే, తమిళ గడ్డపై డీఎంకే తరపున రోజా గళం విప్పడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.



# బీఆర్ నాయుడు స్త్రీలోలుడు: భూమన

తిరుపతి, మార్చి 2 (ఈవార్తలు): టీటీడీ ప్రస్తుత ఛైర్మన్ బీఆర్ నాయుడు లక్ష్యంగా మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శల దాడిని ఉద్ధృతం చేశారు. తిరుపతిలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భూమన మాట్లాడుతూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "బీఆర్ నాయుడు... నువ్వు నా కాలి గోటికి కూడా సరిపోవు, నిన్ను కనీసం మనిషిలా కూడా చూడను" అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఓ దశలో "పోరంబోకు" అనే పదం కూడా ఉపయోగించారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు ఒక మహిళతో సన్నిహితంగా ఉన్నట్లు చెబుతున్న కొన్ని వీడియోలు, ఫొటోలను భూమన మీడియా ముందు ప్రదర్శించడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. తమపై వస్తున్న ఆరోపణలను బీఆర్ నాయుడు 'డీప్ ఫేక్' అని కొట్టిపారేయడాన్ని భూమన తీవ్రంగా తప్పుబట్టారు. అవి డీప్ ఫేక్ వీడియోలు కావని, తాము అన్ని కోణాల్లో నిజానిజాలు నిర్ధారించుకున్న తర్వాతే ఈ విషయాన్ని బయటపెడుతున్నామని స్పష్టం చేశారు. 2019లోనే సదరు మహిళ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాసిందని... బీఆర్ నాయుడు మహిళా వ్యసనపరుడని ఆ లేఖలో పేర్కొన్నదని భూమన తెలిపారు. అప్పట్లో ఆ లేఖ చూసి ఆయన కన్నీళ్లు పెట్టుకుంటే నమ్మానని, కానీ ఇప్పుడు వీడియోలు ప్రత్యక్షం కావడంతో అసలు రంగు బయటపడిందని ఆరోపించారు. పవిత్రమైన టీటీడీ ఛైర్మన్ పదవిలో కొనసాగే అర్హత ఆయనకు లేదని, తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ రాజీనామా చేయకుంటే భవిష్యత్తులో మరిన్ని వాస్తవాలను ఆధారాలతో సహా బయటపెడతామని భూమన హెచ్చరించారు.

# ఒకే కుటుంబంలో నలుగురు మిస్సింగ్

**శ్రీసత్యసాయి జిల్లాలో విషాదం**

శ్రీసత్యసాయి జిల్లా, మార్చి 2 (ఈవార్తలు): ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల మండలంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు అదృశ్యం కావడం స్థానికంగా కలకలం రేపుతోంది. హెచ్.టి హళ్లి వడ్రహట్టి గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి వీరేశ్ కుటుంబంలో ఈ విచారకర ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరేశ్ తన తల్లి సుబ్బమ్మ, భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు రోహిణి, రచనలతో కలిసి నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసైన వీరేశ్ తరచూ ఇంట్లో గొడవ పడుతూ భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 27న కూడా దంపతుల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ జరిగింది.



# స్టార్టప్.. 'ఏఐ' గెటప్!

**కృత్రిమ మేధతో అంకుర సంస్థల హుషారు.. నిత్యజీవిత సవాళ్లకు ఏఐతో పరిష్కారాలు.. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ప్రదర్శన**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను కొత్త అవకాశంగా భావిస్తున్నాయి భారతీయ అంకుర సంస్థలు. నిత్యజీవిత సవాళ్లకు ఏఐ ఆధారంగా సవాళ్లను కనుగొంటున్నాయి. ఈ ఏఐ ఉత్పత్తులు సమయాన్ని సద్వినియోగం చేస్తున్నాయి. పనితీరును సమర్థంగా మారుస్తున్నాయి. ఇటీవల ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఇండియా ఏఐ సమ్మిట్ 2026లో పలు అంకుర సంస్థలు అభివృద్ధి చేసిన ఏఐ ఉత్పత్తులను ప్రదర్శించాయి. సదస్సుకు హాజరైన ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నాయి.

### ఏఐతో ఎగ్జామ్ కోచింగ్

ఐఐటీ కాన్పూర్, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కలిసి సాథీ – సెల్ఫ్ అసెస్‌మెంట్, టెస్ట్ అండ్ హెల్ప్ ఫర్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్(ఎస్ఏటీహెచ్ఈఈ) అనే ఏఐ ప్లాట్‌ఫార్మ్‌ను అభివృద్ధి చేసి ఆవిష్కరించాయి. ఇది జేఈఈ, నీట్, క్లాట్, ఐసీఏఆర్, సీయూఈటీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్ వంటి ఎనిమిది ప్రధాన పోటీ పరీక్షలకు ఉచితంగా ఏఐ ఆధారిత శిక్షణ, మెంటార్‌షిప్ సహాయాన్ని అందిస్తుంది. విద్యార్థులను అనుమానాలను సైతం నివృత్తి చేస్తుంది. ప్రస్తుతం 13 భారతీయ భాషల్లోనూ ఇందులో కంటెంట్ ఉంది.

### ఏఐతో కట్టుదిట్టమైన నిఘా

సీసీ కెమెరాలు వచ్చాక నిఘా, భద్రత వ్యవస్థ బలోపేతమయ్యింది. అయితే, ఈ సీసీ కెమెరాలకు ఏఐ తోడైతే మరింత పటిష్టమైన నిఘా వ్యవస్థను రూపొందించవచ్చని చెప్తోంది గురుగ్రామ్‌కు చెందిన "ఐరిస్: వాల్యూ క్యాటలిస్ట్" అనే సంస్థ. సీసీఫుటేజ్‌ను మాన్యువల్‌గా వెతకడానికి చాలా సమయం, శ్రమ అవసరం. అయితే, ఈ సంస్థ అభివృద్ధి చేసిన ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తే.. ఒక్క కమాండ్ ఇస్తే మొత్తం ఫుటేజీ నుంచి మనకు కావాల్సిన విజువల్‌ను బయటకు తీస్తుంది.



### రైలు భద్రత కోసం ఏఐ

రైలు ప్రమాద నివారణకు ఏఐ ఆధారిత టూల్స్‌ను అభివృద్ధి చేస్తోంది 'రైల్‌ల్యాబ్స్: రైల్వే డిజిటల్ సేఫ్టీ" అనే సంస్థ. రైల్వే ట్రాక్ తనిఖీ మరింత పకడ్బందీగా చేపట్టేందుకు అరిస్ట అనే ఏఐ ఆధారిత ట్రాక్ ఇన్‌స్పెక్షన్ రోబోను ఈ సంస్థ తయారుచేసింది. అల్ట్రాసోనిక్ ఫ్లా డిటెక్టర్‌ల ద్వారా రైల్వే ట్రాక్‌లు విరిగినా, ఫిష్‌ప్లేట్లు, బోల్టులు లేకపోయినా ఈ రోబో గుర్తిస్తుంది. మాన్యువల్‌గా చేసే ట్రాక్ ఇన్‌స్పెక్షన్‌తో పోలిస్తే 200% సమర్థంగా ఈ రోబో ద్వారా పరిశీలించవచ్చని రైల్‌ల్యాబ్స్ సంస్థ చెప్తోంది. ఇప్పటికే ఈ సంస్థ అభివృద్ధి చేసిన చక్రవ్యూ అనూ మరో ఉత్పత్తి వినియోగంలో ఉంది.

## రాష్ట్రాలకు హై అలర్ట్

**ఖమేని మృతి నేపథ్యంలో కేంద్ర డెసిషన్**

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, అమెరికా – ఇరాన్ మధ్య రేగిన యుద్ధ సెగలు ఇప్పుడు అంతర్జాతీయ సరిహద్దులు దాటి ఇండియాను కూడా తాకుతున్నాయి. ఇరాన్ అత్యున్నత ఆధ్యాత్మిక నేత అయతొల్లా అలీ ఖమేనీ మృతి నేపథ్యంలో భారత్ లో కూడా కొన్ని చోట్ల నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలో దేశీయంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను హై అలర్ట్ చేసింది. ముఖ్యంగా ఇరాన్ అనుకూల రాడికల్ శక్తులు మతపరమైన ప్రార్థనా స్థలాలు లేదా బహిరంగ సభలను వేదికగా చేసుకుని రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో కేంద్ర హోం శాఖ అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాలకు అత్యవసర లేఖలు పంపింది. మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తకుండా గూఢచారి విభాగాల మధ్య సమాచార మార్పిడిని వేగవంతం చేయాలని, సున్నితమైన ప్రాంతాల్లో నిఘా కట్టుదిట్టం చేయాలని ఆదేశించింది. ఖమేనీ మృతికి నిరసనగా ఇప్పటికే ఢిల్లీ, లక్నో, శ్రీనగర్ వంటి నగరాల్లో భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ ఆందోళనలను అదునుగా తీసుకుని అరాచక శక్తులు హింసకు ప్రేరేపించే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే పశ్చిమాసియాలో మారుతున్న సమీకరణాలను ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. గత రాత్రి ఆయన నేతృత్వంలో జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో ప్రస్తుత యుద్ధ వాతావరణంపై లోతైన సమీక్ష నిర్వహించారు.

## ఖమేనీ భార్య కూడా మృతి



టెహ్రాన్: ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఖమేనీ భార్య మన్సూరేహ్ ఖోజస్తే బాగెర్‌జాదే అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా జరిపిన దాడుల్లో తీవ్రంగా గాయపడి మరణించారు. శనివారం ఇరాన్‌పై జరిగిన వైమానిక దాడుల్లో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయని, ఆ తర్వాత కోమాలోకి వెళ్లి సోమవారం తుదిశ్వాస విడిచారని ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఆమె మరణంతో 'షహీద్' (అమరవీరుల) స్థాయికి చేరుకున్నారని ఆ దేశ ప్రసార సంస్థ ప్రెస్ టీవీ పేర్కొంది. ఇదే దాడుల్లో అయతొల్లా ఖమేనీ కూడా మరణించినట్లు ఇరాన్ మీడియా ఇదివరకే ప్రకటించింది. కేవలం ఖమేనీ దంపతులే కాకుండా.. వారి కుమార్తె, మనవరాలు, కోడలు, అల్లుడు కూడా ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఇరాన్ అత్యున్నత నాయకుడి కుటుంబం మొత్తం తీవ్ర ప్రభావానికి లోనైంది. 1947లో మష్హద్‌లోని ఓ వ్యాపారి కుటుంబంలో జన్మించిన మన్సూరేహ్, 1964లో ఖమేనీని వివాహం చేసుకున్నారు. వీరికి ఆరుగురు సంతానం కాగా, ఆమె జీవితాంతం బయటి ప్రపంచానికి దూరంగా, అంతర్ముఖంగానే ఉన్నారు. తాజా పరిణామాలతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఈ దాడులకు ప్రతీకారంగా దీర్ఘకాలిక యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధికారులు ప్రకటించడంతో అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# విపణిలోకి ఐఫోన్ 17ఈ

**ధర తక్కువ.. ఫీచర్లు ఎక్కువ**



యాపిల్ తన వినియోగదారులకు శుభవార్త చెప్పింది. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఐఫోన్ 17 సిరీస్‌లో భాగంగా సరికొత్త, అత్యంత శక్తివంతమైన 'ఐఫోన్ 17ఈ' స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించింది. దీంతో పాటు శక్తివంతమైన ఎం4 చిప్‌తో కూడిన కొత్త ఐపాడ్ ఎయిర్‌ను కూడా మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. ఐఫోన్ 17ఈ మోడల్ అత్యాధునిక ఏ19 చిప్‌తో పనిచేస్తుందని, ఇది మునుపటి కంటే వేగవంతమైన పనితీరును అందిస్తుందని యాపిల్ వెల్లడించింది. ఐఫోన్ 17ఈలో యాపిల్ స్వయంగా రూపొందించిన లేటెస్ట్ జనరేషన్ సెల్యులార్ మోడెమ్ 'సీ1ఎక్స్'ను అమర్చారు. ఐఫోన్ 16ఈలోని సీ1 మోడెమ్‌తో పోలిస్తే ఇది రెండు రెట్లు వేగంగా పనిచేస్తుంది. ఇక కెమెరా విషయానికి వస్తే, ఇందులో 48 మెగాపిక్సెల్ ఫ్యూజన్ కెమెరాను ఏర్పాటు చేశారు. ఇది అద్భుతమైన ఫొటోలతో పాటు, నెక్స్ట్ జనరేషన్ పోర్ట్రెయిట్స్, 4కే డాల్బీ విజన్ వీడియోలను రికార్డ్ చేయగలదు. ఇందులో ఆప్టికల్ క్వాలిటీ 2ఎక్స్ టెలిఫోటో సదుపాయం ఉండటం వల్ల ఒకే ఫోన్‌లో రెండు కెమెరాలు ఉన్న అనుభూతిని ఇస్తుంది. ఈ ఫోన్ 6.1 అంగుళాల సూపర్ రెటినా ఎక్స్‌డీఆర్ డిస్‌ప్లేను కలిగి ఉంది. దీనికి 'సిరామిక్ షీల్డ్ 2' రక్షణ కల్పించారు. ఇది గత తరం ఫోన్ల కంటే మూడు రెట్లు అధికంగా గీతలు పడకుండా కాపాడుతుంది. బ్లాక్, వైట్, మరియు సరికొత్త సాఫ్ట్ పింక్ రంగుల్లో లభించే ఈ ఫోన్ ప్రీమియం మ్యాట్ ఫినిష్‌తో వస్తుంది.

**ధర,స్టోరేజ్..**

ఐఫోన్ 17ఈ ప్రారంభ ధర రూ.64,900గా నిర్ణయించారు. విశేషమేమిటంటే, గతంలో ఇదే ధరకు లభించే ఎంట్రీ లెవల్ స్టోరేజీని ఈసారి రెట్టింపు చేశారు. అంటే రూ.64,900 ధరకు 256 జీబీ స్టోరేజ్ లభిస్తుంది. ఇది ఐఫోన్ 12తో పోలిస్తే 4 రెట్లు ఎక్కువ స్టోరేజ్ కావడం గమనార్హం. దీనివల్ల యూజర్లు ఎక్కువ ఫొటోలు, వీడియోలు, గేమ్స్ స్టోర్ చేసుకోవచ్చు. ఐఓఎస్ 26 పవర్ మేనేజ్‌మెంట్‌తో బ్యాటరీ రోజంతా వస్తుందని కంపెనీ తెలిపింది. యాపిల్ వైస్ ప్రెసిడెంట్ (ప్రొడక్ట్ మార్కెటింగ్) కైయాన్ డ్రాన్స్ మాట్లాడుతూ.. 'వినియోగదారులు కోరుకునే పనితీరు, ఫీచర్లను తక్కువ ధరలో ఐఫోన్ 17ఈ అందిస్తుంది. భవిష్యత్తులోనూ వేగంగా, సురక్షితంగా పనిచేసేలా దీనిని తీర్చిదిద్దాం' అని పేర్కొన్నారు. యాపిల్ ఇదే వేదికపై ఎం4 చిప్‌తో కూడిన కొత్త ఐపాడ్ ఎయిర్‌ను కూడా పరిచయం చేసింది. ఇది ఎం3 చిప్ ఉన్న ఐపాడ్ ఎయిర్ కంటే 30 శాతం వేగంగా, ఎం1 చిప్ ఉన్న మోడల్ కంటే 2.3 రెట్లు వేగంగా పనిచేస్తుంది. వీడియో ఎడిటింగ్, గేమింగ్ వంటి పనులకు ఇది ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఇందులో వైఫై-7 సపోర్ట్, ఎన్1, సి1ఎక్స్ చిప్స్ ఉండటం వల్ల కనెక్టివిటీ చాలా వేగంగా ఉంటుంది. 11 అంగుళాల ఐపాడ్ ఎయిర్ ధర రూ.64,900 కాగా, 13 అంగుళాల మోడల్ ధర రూ.84,900గా ఉంది. విద్యార్థుల కోసం వీటిని మరింత తక్కువ ధరకు (రూ.59,900 మరియు రూ.79,900) అందిస్తున్నారు. ఐఫోన్ 17ఈ, కొత్త ఐపాడ్ ఎయిర్‌ల ప్రీ-ఆర్డర్లు మార్చి 4 నుంచి ప్రారంభమవుతాయి. మార్చి 11 నుంచి ఇవి నేరుగా కొనుగోలుకు అందుబాటులో ఉంటాయని యాపిల్ ప్రకటించింది.

# పాక్ కకావికలం!

**ఆ దేశ స్టాక్ మార్కెట్ కుదేల్**

**అమెరికా-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో అల్లర్లు**



ఇస్లామాబాద్: ఓవైపు అమెరికా-ఇరాన్ మధ్య చెలరేగిన యుద్ధం, మరోవైపు అఫ్ఘానిస్థాన్‌తో సరిహద్దు ఘర్షణల నేపథ్యంలో పాకిస్థాన్ స్టాక్ మార్కెట్ సోమవారం కుప్పకూలింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, దేశీయంగా చెలరేగిన అల్లర్లతో మదుపర్లు భయందోళనకు గురవడంతో పాకిస్థాన్ బెంచ్‌మార్క్ కేఎస్ఈ-100 సూచీ దాదాపు 10 శాతం మేర పతనం అయ్యింది. మార్కెట్ ఆరంభంలోనే భారీ అమ్మకాలతో సూచీలు నేలచూపులు చూశాయి. మధ్యాహ్న సమయానికి కేఎస్ఈ-100 సూచీ 151,798 పాయింట్ల వద్ద ట్రేడ్ అవుతూ 9.68 శాతం నష్టపోయింది. అమ్మకాల ఒత్తిడి తీవ్రం కావడంతో ఒక గంట పాటు ట్రేడింగ్‌ను నిలిపివేయాల్సి వచ్చింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని అమెరికా-ఇజ్రాయెల్ దళాలు వైమానిక దాడుల్లో హతమార్చడంతో పాకిస్థాన్‌లో ఆగ్రహజ్వాలలు ఎగిసిపడ్డాయి. కరాచీలోని అమెరికా కాన్సులేట్ వద్ద ఆందోళనకారులు విధ్వంసానికి దిగారు. అక్కడ భద్రతగా ఉన్న అమెరికా మెరైన్ సిబ్బంది జరిపిన కాల్పుల్లో 12 మంది నిరసనకారులు మృతి చెందగా, దేశవ్యాప్తంగా జరిగిన అల్లర్లలో మొత్తం 35 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా పేర్కొంది. మరోవైపు అఫ్ఘానిస్థాన్ తాలిబన్లతో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందం రద్దయ్యింది. కాబూల్‌పై పాక్ ఓపెన్ వార్ ప్రకటించడంతో పరిస్థితులు మరింత విషమించాయి. ఈ పరిణామాలపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అత్యవసర ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ ఉద్రిక్తతల ప్రభావం ఆసియా పసిఫిక్ మార్కెట్లపైనా తీవ్రంగా పడింది. భారత స్టాక్ మార్కెట్లు కూడా భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 1.29 శాతం (1,048 పాయింట్లు) నష్టపోయి 80,238 వద్ద, నిఫ్టీ 1.24 శాతం (312 పాయింట్లు) నష్టపోయి 24,865 వద్ద ముగిశాయి. 2025 సెప్టెంబర్ తర్వాత మార్కెట్లు ఇంతలా పతనం కావడం ఇదే తొలిసారి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ సైనిక చర్య మరో నాలుగు వారాలు సాగొచ్చని సంకేతాలు ఇవ్వడంతో ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొంది.

# ట్రంప్ సొంత నిర్ణయాలు?

**ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ ఉమ్మడి దాడులు**

**కాంగ్రెస్ ఆమోదం లేకుండానే ట్రంప్ నిర్ణయం**

**ట్రంప్ పై సెనేటర్ల విమర్శలు**



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న సంచలన నిర్ణయంతో గల్ఫ్ దేశాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ఇరాన్‌లో పాలన మార్పు లక్ష్యంగా ఆ దేశంపై భారీ సైనిక దాడులకు ట్రంప్ ఆదేశించారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన ఈ భీకర దాడుల్లో ఇరాన్ సర్వోన్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ సహా పలువురు ఉన్నతాధికారులు మరణించారు. ఈ పరిణామంతో ఆగ్రహించిన ఇరాన్ తక్షణమే ప్రతీకార దాడులకు దిగడంతో మధ్యప్రాచ్యంలో పూర్తిస్థాయి యుద్ధ వాతావరణం నెలకొంది. ఇరాన్ దాడుల్లో ఇప్పటికే ముగ్గురు అమెరికా సైనికులు మరణించినట్లు సమాచారం. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. అయితే, ఈ దాడుల కోసం అధ్యక్షుడు ట్రంప్ కాంగ్రెస్ అనుమతి తీసుకోకపోవడం అమెరికాలో తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. డెమోక్రాట్లతో పాటు సొంత రిపబ్లికన్ పార్టీకి చెందిన కొందరు సభ్యులు కూడా ట్రంప్ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, చట్టవిరుద్ధ యుద్ధమని వారు ఆరోపిస్తున్నారు. 'ఇది అమెరికా కాంగ్రెస్‌పై జరిగిన దాడి. ఎలాంటి తక్షణ ముప్పు లేనప్పుడు అధ్యక్షుడు చట్టవిరుద్ధంగా యుద్ధం ప్రకటించారు. గతంలో జార్జ్ డబ్ల్యూ బుష్ కాంగ్రెస్‌తో సంప్రదించే నిర్ణయం తీసుకున్నారు' అని కాలిఫోర్నియా డెమోక్రాట్ ప్రతినిధి రో ఖన్నా తీవ్రంగా విమర్శించారు. కెంటకీ రిపబ్లికన్ ప్రతినిధి థామస్ మాసీ, సెనేటర్ రాండ్ పాల్ వంటి వారు కూడా ఈ యుద్ధానికి వ్యతిరేకంగా గళం విప్పారు. యుద్ధం ప్రకటించే అధికారం కేవలం కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని, ఇది 'అమెరికా ఫస్ట్' విధానం కాదని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ట్రంప్ చర్యకు వ్యతిరేకంగా ఓటింగ్ జరపాలని, ఇందుకోసం కాంగ్రెస్‌ను తక్షణమే సమావేశపరచాలని పలువురు సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వారం మధ్యలో దీనిపై ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. అయితే, స్పీకర్ మైక్ జాన్సన్, సెనేట్ మెజారిటీ లీడర్ జాన్ థూన్ వంటి రిపబ్లికన్ అగ్ర నాయకులు ట్రంప్ నిర్ణయాన్ని సమర్థించారు. అధ్యక్షుడికి రాజ్యాంగబద్ధంగా ఈ అధికారం ఉందని వారు వాదిస్తున్నారు. మరోవైపు, ఇరాన్ తన ప్రతీకార దాడులను ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై విస్తరిస్తుండటంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి.




## దుబాయ్ ఎయిర్‌పోర్టులో పాక్షిక కార్యకలాపాలు

దుబాయ్: అమెరికా-ఇజ్రాయెల్ కూటమి, ఇరాన్ మధ్య తలెత్తిన తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో నిలిచిపోయిన విమాన సర్వీసులు యూఏఈలో పాక్షికంగా తిరిగి ప్రారంభమయ్యాయి. దుబాయ్ ఎయిర్‌పోర్ట్ నుంచి కార్యకలాపాలు పునరుద్ధరించినట్లు అధికారులు ధృవీకరించిన అనంతరం, ప్రముఖ విమానయాన సంస్థలు ఎమిరేట్స్, ఎతిహాద్ కీలక ప్రకటన చేశాయి. సోమవారం సాయంత్రం నుంచి పరిమిత సంఖ్యలో విమానాలను నడపనున్నట్లు ఈ సంస్థలు వెల్లడించాయి. తమ సేవలను దశలవారీగా పునరుద్ధరిస్తున్నామని, ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు మొదటి ప్రాధాన్యం ఇస్తామని ఎమిరేట్స్ స్పష్టం చేసింది. అయితే, ఎయిర్‌లైన్స్ నుంచి నేరుగా సమాచారం లేదా కన్ఫర్మేషన్ వచ్చిన తర్వాతే ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు రావాలని సూచించింది. లేకపోతే ఎయిర్‌పోర్టుకు రావద్దని విజ్ఞప్తి చేసింది. మరోవైపు, ఎతిహాద్ ఎయిర్‌వేస్ కూడా యూఏఈ అధికారుల సమన్వయంతో, కఠినమైన భద్రతా అనుమతులకు లోబడి కార్గో మరియు స్వదేశానికి చేర్చే విమానాలను నడుపుతున్నట్లు తెలిపింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులు చేయడంతో గగనతలాన్ని మూసివేసిన విషయం తెలిసిందే. ఈ దాడుల కారణంగా దుబాయ్, అబుదాబి, దోహాల్లో వేల సంఖ్యలో ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఆసియా, ఐరోపా, అమెరికాల మధ్య కీలకమైన ఈ రూట్లలో రాకపోకలు స్తంభించడంతో ప్రపంచవ్యాప్తంగా విమాన నెట్‌వర్క్ దెబ్బతింది. అయితే, సాధారణ విమాన సర్వీసులు ఎప్పటి నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయనే దానిపై అధికారులు ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతానికి అత్యవసర మరియు పరిమిత విమానాలు మాత్రమే దుబాయ్ ఇంటర్నేషనల్, అల్ మక్తూమ్ ఎయిర్‌పోర్టుల నుంచి నడుస్తున్నాయి.

## మరిన్ని భీకర దాడులు చేస్తాం

**ఇరాన్ ప్రజలు బయటకు రావొద్దు**

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక**



వాషింగ్టన్: మరిన్ని భీకర దాడులు చేస్తామని, ఇరాన్ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ దాడులు, ప్రతిదాడులు మూడో రోజు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ మాట్లాడుతూ, తమ జోలికి ఎవరు వచ్చినా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. త్వరలో మరిన్ని తీవ్ర దాడులు ఉంటాయని తెలిపారు. ప్రజలంతా సురక్షితంగా ఉండాలని, వారు ఇళ్లలో నుంచి బయటకు రావొద్దని సూచించారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యాన్ని అమెరికా కలిగి ఉందని, దానిని ఇప్పుడు ఉపయోగిస్తున్నామని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ సాఫీగా, తమకు ఎలాంటి ఇబ్బందిలేకుండా సాగుతోందని తాను విశ్వసిస్తున్నానని అన్నారు. ఇరాన్ ప్రజలు నియంత పాలన నుంచి స్వేచ్ఛ పొందడానికి అమెరికా ఈ సైనిక చర్యకు ఉపక్రమించిందని అన్నారు. ఇరాన్ ఇలాగే దాడులు కొనసాగిస్తే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఇరాన్‌పై అసలైన దాడిని ఇంకా ప్రారంభించలేదని, ఆ దేశం ఇలాగే వ్యవహరిస్తే దాడి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ఆయన సీఎన్ఎన్ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.

## ఏఐ తీర్పులు ప్రామాణికమా?

**ట్రయల్ కోర్టులపై సుప్రీం ఆగ్రహం**

**ఏపీ హైకోర్టు పరిధిలోని ఆస్తి తగాదా కేసులో ఘటన**

**అటార్నీ జనరల్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు నోటీసులు**

న్యూఢిల్లీ: ఉనికిలో లేని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సృష్టించిన నకిలీ తీర్పులను ప్రామాణికంగా తీసుకుని ఒక సివిల్ కేసులో ట్రయల్ కోర్టు వ్యవహరించిన తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కేవలం నిర్ణయం తీసుకోవడంలో జరిగిన పొరపాటు కాదని, న్యాయమూర్తుల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇలాంటి చర్యలు న్యాయవ్యవస్థ విశ్వసనీయతకే భంగం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిధిలోని ఓ ఆస్తి తగాదా కేసులో ఈ విషయం వెలుగుచూసింది. అడ్వకేట్ కమిషనర్ నివేదికపై ప్రతివాదుల అభ్యంతరాలను తోసిపుచ్చుతూ ట్రయల్ కోర్టు కొన్ని సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరించింది. అయితే, ఆ తీర్పులు అసలు లేనే లేవని, అవి ఏఐ సృష్టించిన నకిలీవని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తెచ్చారు. ఏపీ హైకోర్టు కూడా అవి నకిలీ తీర్పులేనని గుర్తించి హెచ్చరించినప్పటికీ, కేసు మెరిట్స్ ఆధారంగా పిటిషన్‌ను కొట్టివేసింది. దీనిని సవాలు చేస్తూ పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేల ధర్మాసనం.. ఏఐ సృష్టించిన నకిలీ తీర్పుల ఆధారంగా న్యాయస్థానాలు నడుచుకోవడం సంస్థాగతంగా ఆందోళన కలిగించే అంశమని పేర్కొంది. దీనికి చట్టపరమైన పర్యవసానాలు ఉంటాయని హెచ్చరించింది. ఈ వ్యవహారంపై అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు నోటీసులు జారీ చేసింది. కోర్టుకు సహాయం చేసేందుకు సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్‌ను అమికస్ క్యూరీగా నియమించింది. తదుపరి విచారణను మార్చి 10కి వాయిదా వేస్తూ,

ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
మంగళవారం 3-3-2026 www.evarthalu.com


లయ్యారి చిత్రం


ఊర్వశి రౌతేలా

## వచ్చే వారం ఓటీటీల్లో వచ్చే సినిమాలివే..

మార్చి నెల ప్రారంభం కావడంతో ఓటీటీ ప్రియులను అలరించేందుకు సరికొత్త కంటెంట్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే స్ట్రీమింగ్ అవుతున్న సినిమాలు, వెబ్ సిరీస్‌లకు అదనంగా మరింత ఎంటర్‌టైన్‌మెంట్ యాడ్ కానుంది. మార్చి తొలి వారంలో ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు వస్తున్న సినిమాలు ఏవంటే..



**నెట్‌ఫ్లిక్స్ :**
విత్ లవ్ (తెలుగు డబ్బింగ్ మూవీ) - మార్చి 6
వార్ మెషీన్ (ఇంగ్లీష్ మూవీ) - మార్చి 6
హలో బచ్చేన్ (హిందీ సిరీస్) - మార్చి 6

**జియో హాట్‌స్టార్ :**
విక్రమ్ ఆన్ డ్యూటీ (తెలుగు సిరీస్)- మార్చి 6

**అమెజాన్ ప్రైమ్ వీడియో :**
తన్వి ది గ్రేట్ (హిందీ మూవీ) - మార్చి 3
యంగ్ షెర్లాక్ (ఇంగ్లీష్ సిరీస్) - మార్చి 4
సుబేదార్ (హిందీ మూవీ) - మార్చి 5


**ఆహా :**
ఓం శాంతి శాంతి శాంతిః - మార్చి 4

**జీ5 :**
గాంధీ టాక్స్ (తెలుగు డబ్బింగ్ మూవీ)-మార్చి 6
జబ్ ఖులీ కితాబ్ (హిందీ మూవీ) - మార్చి 6

**సోనీ లివ్ :**
లాలో కృష్ణ సదా సహాయతే (హిందీ మూవీ) - మార్చి 6

## విరోష్.. 'శ్రీమంతులు'

**సొంతూరిలో గృహప్రవేశం.. ఊరోళ్లందరికీ దావత్.. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ప్రకటన**



టాలీవుడ్ సెన్సేషనల్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలు వివాహం తర్వాత తొలిసారి విజయ్ స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మెన్ పేటకు చేరుకున్నారు. సోమవారం ఉదయం గ్రామానికి చేరుకున్న ఈ నూతన వధూవరులకు గ్రామస్థులు తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో డప్పు వాయిద్యాలు, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన ఫామ్ లో నూతనంగా నిర్మించిన గృహంలోకి విజయ్–రష్మిక దంపతులు గృహప్రవేశం చేశారు. అనంతరం వేద పండితుల సమక్షంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మధ్య జరిగిన ఈ వేడుకలో విజయ్ దంపతులు సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిపోయారు. సినీ రంగంలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, తన మూలాలను మర్చిపోకుండా విజయ్ తన సొంత ఊరికి రావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గృహప్రవేశం అనంతరం విజయ్ గ్రామస్థులందరికీ భారీ విందు (దావత్) ఏర్పాటు చేశారు. ఊరందరినీ పిలిచి విందు ఏర్పాటు చేయడం విశేషం. ఈ సందర్భంగా ఫామ్ హౌస్ వద్ద విజయ్, రష్మికలతో ఫొటోలు దిగేందుకు అభిమానులు, గ్రామస్థులు పోటీ పడ్డారు.

**ఊరికి ఎంతో చేయాలి: విజయ్**

విజయ్ దేవరకొండ తన సొంత ఊరికి వరాల జల్లు కురిపించారు. ముఖ్యంగా విద్యార్థుల కోసం ఆయన చేసిన కీలక ప్రకటన చేశాడు. గ్రామస్తులకు విందు ఏర్పాటు చేసిన విజయ్ దేవరకొండ దంపతులు మాట్లాడుతూ.. 'పెళ్లి చేసుకున్న తర్వాత ఊర్లో పదిమందికి ఏదో మంచి చేయాలనిపించింది. అందులో భాగంగానే దేవరకొండ ఫౌండేషన్ ద్వారా అచ్చంపేట నియోజకవర్గంలో ఉన్న 44 ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎవరైతే ఫస్ట్ ,సెకండ్ ర్యాంకుల్లో స్థానాలు సంపాదించుకుంటారో వారికి ఈ ఏడాది నుంచి స్కాలర్‌షిప్ అందిస్తాం' అని ప్రకటించాడు. 'చాలా ఏళ్ల తర్వాత సొంత ఊరిలో ఇల్లు కట్టుకోవడం , పెళ్లి చేసుకోవడం ఒకేసారి జరగడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఇక నుంచి గ్రామానికి రెగ్యులర్ గా వస్తాం. ఊరికి చేసేది చాలా ఉంది. అందరం కలిసి ఊరిని అభివృద్ధి చేద్దాం. తరచూ గ్రామానికి వస్తూ ఉంటాం. కచ్చితంగా అభివృద్ధి దిశగా అడుగులు వేద్దాం' అని ఊరి ప్రజలకు శుభవార్త చెప్పాడు.

**తమ్ముడి పెళ్లి ఊళ్లోనే..!**

తన తమ్ముడు ఆనంద్ దేవరకొండ పెళ్లి గురించి మాట్లాడి అభిమానులను విజయ్ సర్ప్రైజ్ చేశారు. 'నా తమ్ముడు ఆనంద్ దేవరకొండ పెళ్లి గ్రామంలోనే అందరి సమక్షంలో చేస్తాం' అని ప్రకటించాడు విజయ్. మంచి అమ్మాయి దొరికినా, ఎవరినైనా ఆనంద్ ఇష్టపడినా వారి పెళ్లి తుమ్మన్ పేటలోనే జరుగుతుందన్న మాట.

## అంటార్కిటికాకు 'వారణాసి'


గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా నటించిన హాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది బ్లఫ్' ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. ఇందులో ప్రియాంక నటనపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ఈ సినిమాపై దర్శక దిగ్గజం రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు ప్రశంసల వర్షం కురిపించారు. రాజమౌళి తన ఎక్స్ ఖాతాలో స్పందిస్తూ... ప్రియాంక ఒకే సమయంలో సున్నితత్వాన్ని, తీవ్రమైన శక్తిని ప్రదర్శించగల అరుదైన నటి అని, 'ది బ్లఫ్'లో ఆమె చేసిన యాక్షన్ స్టంట్స్ అద్భుతమని కొనియాడారు. అటు మహేశ్ బాబు సైతం ఈ చిత్రాన్ని అద్భుతమైన యాక్షన్ ఎమోషన్స్ ఉన్న చిత్రంగా అభివర్ణిస్తూ, ప్రియాంక నటన సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లిందని అభినందించారు. ఈ ట్వీట్‌కు ప్రియాంక చోప్రా రిప్లై ఇస్తూ.. 'థాంక్యూ మై ఫ్రెండ్.. త్వరలోనే అంటార్కిటికాలో కలుద్దాం' అంటూ ఆమె బదులిచ్చింది. ఈ కామెంట్‌తో వారణాసి తదుపరి షెడ్యూల్ మంచు ఖండమైన అంటార్కిటికాలో జరగబోతోందని ధ్రువీకరించినట్లయింది.



## పెళ్లాన్ని అడిగినట్టే అడుగుతున్నారు

ఓ కాలేజీ ఈవెంట్ లో శ్రీలీల చేసిన కామెంట్ నెట్టింట్లో వైరల్ అవుతోంది. విషయంలోకి వెళ్తే.. కార్యక్రమానికి హాజరైన ఆమెను చూసి విద్యార్థులు ఫుల్ హ్యాపీగా ఫీల్ అయ్యారు. అరిచి అరిచి గొంతు పోయిందని చెప్పగా, బ్యాక్ గ్రౌండ్ లో ఓ అభిమాని 'డ్యాన్స్ చేయ్' అంటూ అరిచాడు. దానికి వెంటనే స్పందించిన శ్రీలీల 'నిజంగా పెళ్లాన్ని అడిగినట్టే అడుగుతున్నారు' అంటూ సరదాగా కౌంటర్ ఇచ్చింది. ఆమె డైలాగ్ టైమింగ్, ఎక్స్‌ప్రెషన్స్ చూసి అక్కడున్నవాళ్లంతా ఫుల్ గా నవ్వేశారు. అందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌అవుతోంది.





## ఉస్తాద్ రీమేక్ కాదు:

పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై గత కొంతకాలంగా జరుగుతున్న ప్రచారానికి దర్శకుడు హరీశ్ శంకర్ ఫుల్‌స్టాప్ పెట్టారు. ఈ సినిమా తమిళ బ్లాక్‌బస్టర్ 'తెరి'కి రీమేక్ అంటూ వస్తున్న ఊహాగానాలపై ఆయన ఘాటుగా స్పందించారు. తన సినిమా రీమేక్ కాదని స్పష్టం చేయడమే కాకుండా అసలు 'తెరి' చిత్రంలోనే తన 'గబ్బర్ సింగ్' సినిమాలోని ఓ సన్నివేశాన్ని కాపీ చేశారని ఆరోపించారు. తాజాగా ఓ ప్రమోషనల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన హరీశ్ శంకర్, తాను రీమేక్ చేస్తే నిజాయతీగా ఒప్పుకుంటానని స్పష్టం చేశారు. "గబ్బర్ సింగ్ చిత్రానికి నేను 'మాటలు, మార్పులు, దర్శకత్వం' అని టైటిల్ కార్డ్ వేసుకున్నాను. బహుశా తెలుగు ఇండస్ట్రీలో అలా వేసుకున్న మొదటి వ్యక్తిని నేనే.

## వివాదంలో మంజుమ్మల్ బాయ్స్ డైరెక్టర్

మలయాళ దర్శకుడు చిదంబరం వివాదంలో చిక్కుకున్నారు. శౌబిన్ షాహిర్, బాబు షాహిర్, షాన్ ఆంటోనీ ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ బ్లాక్ బస్టర్ మూవీ -మంజుమ్మల్ బాయ్స్-. 2024లో విడుదలైన ఈ సర్వైవల్ థ్రిల్లర్ అన్ని భాషల్లోనూ బ్లాక్ బస్టర్ హిట్ అనిపించుకుని వార్తల్లో నిలిచింది. ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందిన ఈ సినిమా పాన్ ఇండియా వైడ్‌గా రికార్డులు సృష్టించింది. కేవలం తక్కువ బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా యునానిమస్ బ్లాక్ బస్టర్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద ఊహించని విధంగా రూ.240 కోట్లకు మించి వసూళ్లని రాబట్టి ట్రేడ్ పండితుల్నే విస్మయానికి గురి చేసింది. ఇంతటి బ్లాక్ బస్టర్ హిట్‌ని అందించిన దర్శకుడు చిరంబరం తాజాగా ఓ వివాదంలో చిక్కుకోవడం మలయాళ ఇండస్ట్రీతో పాటు దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. కేరళలోని ఎర్నాకుళం పోలీస్టేషన్‌లో దర్శకుడు చిదంబరంపై లైంగిక వేధింపుల కేసు నమోదు కావడం కలకలకం రేపుతోంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం...ఓ మహిళ దర్శకుడు చిదంబరంపై లైంగిక ఆరోపణలు చేశారు.




## విశ్వనాథ్ అండ్ సన్స్‌గా సూర్య

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రానికి సంబంధించిన కీలక అప్డేట్ వచ్చేసింది. సూర్య 46వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'విశ్వనాథ్ అండ్ సన్స్' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం అధికారికంగా విడుదల చేసింది. ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో సూర్య కళ్లద్దాలు ధరించి, ఓ చిన్నారిని ఎత్తుకుని ఎంతో ప్రేమగా కనిపిస్తున్నారు.
బాధ్యతాయుతమైన తండ్రి పాత్రలో ఆయన లుక్ పరిపక్వంగా, భావోద్వేగభరితంగా ఉంది.



## బతికి బట్టకట్టాం: మంచు విష్ణు

దుబాయ్‌లో చిక్కుకున్న టాలీవుడ్ నటుడు మంచు విష్ణు, తన కుటుంబం క్షేమంగానే ఉన్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. క్షిపణుల శబ్దాలు దూరం నుంచి వినిపిస్తున్నా, ప్రస్తుతం అంతా ప్రశాంతంగానే ఉందని ఆయన పేర్కొన్నారు. తమ భద్రత కోసం ప్రార్థించిన అభిమానులకు, శ్రేయోభిలాషులకు విష్ణు ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 'మేము సురక్షితంగా ఉన్నాం, కంగారు పడకండి' అంటూ ఆయన పెట్టిన పోస్ట్ వైరల్ అవుతోంది. ఇక గగనతలం క్లియర్ అయిన వెంటనే ఇండియాకు చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గెలుపు సంజూ వల్ల కాదు: గంభీర్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా సెమీస్‌కు దూసుకెళ్లింది. ఆదివారం కోల్‌కతా వేదికగా జరిగిన డూ ఆర్ డై సూపర్-8 మ్యాచ్‌లో టీమిండియా 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే సంజూ శాంసన్‌తో పాటు మ్యాచ్ చివర్లో శివమ్ దూబే కొట్టిన రెండు బౌండరీలు కూడా భారత విజయంలో కీలక పాత్ర పోషించాయని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. తీవ్ర ఒత్తిడిలో దూబే ఆ రౌండు బౌండరీ కొట్టకపోయి ఉంటే పరిస్థితి మరింత క్లిష్టంగా మారేదని చెప్పాడు. భారత



విజయంలో సంజూ ఇన్నింగ్స్ ఎంత పాత్ర పోషించిందో.. శివమ్ దూబే బౌండరీలకు అంతే విలువ ఉందని గంభీర్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న గంభీర్.. శివమ్ దూబే బ్యాటింగ్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. 'మనం కొన్ని ప్రత్యేకమైన సహకారాల గురించి మాట్లాడుకుందాం. శివం దూబే కొట్టిన ఆ రెండు బౌండరీలు.. సంజూ ఆడిన 97 పరుగుల ఇన్నింగ్స్‌తో సమానమని నేను భావిస్తున్నాను. ఇది ఒక టీమ్ గేమ్. కాబట్టి ఆ రెండు బౌండరీలు సంజూ ఇన్నింగ్స్ అంత కీలకం. ఎందుకంటే ఈ మ్యాచ్‌లో భారత్ గెలవకపోయి ఉంటే.. సంజూ ఇన్నింగ్స్ గురించి ఎవరూ మాట్లాడుకునేవాళ్లు కాదు. సంజూ శాంసన్ ఒక అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కానీ జట్టు గెలవడానికి ఇలాంటి చిన్న చిన్న సహకారాలే సహాయపడతాయి. పెద్ద స్కోర్లు హెడ్‌లైన్స్‌లో నిలుస్తాయి, కానీ జట్టు గెలుపు గీత దాటడానికి దోహదపడే ఇలాంటి చిన్న సహకారాలే చాలా కీలకం.




# రేపు తొలి సెమీస్

**కివీస్- సఫారీల పోరు.. ఎల్లుండి భారత్ వర్సెస్ ఇంగ్లండ్.. మ్యాచ్ రద్దయితే రిజర్వ్ డే**

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ తుది దశకు చేరింది. మరో మూడు నాకౌట్ మ్యాచ్‌లతో ఈ మెగా టోర్నీకి తెరపడనుంది. సౌతాఫ్రికా, ఇంగ్లండ్, భారత్, న్యూజిలాండ్ సెమీ ఫైనల్ చేరాయి. బుధవారం(మార్చి 4) కోల్‌కతా వేదికగా న్యూజిలాండ్ ‌- సౌతాఫ్రికా మధ్య తొలి సెమీఫైనల్ మ్యాచ్, గురువారం(మార్చి 5) ముంబైలోని వాంఖడే మైదానం వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌లకు వర్షం అంతరాయం కలిగిస్తే పరిస్థితి ఏంటి? అనేది ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్‌లకు వర్షం ముప్పు లేకున్నా.. మ్యాచ్ సమయానికి వర్షంతో మ్యాచ్ జరగకపోతే ఏం చేస్తారు? అనే ప్రశ్నలు సగటు అభిమానులను వేధిస్తున్నాయి. అయితే ఈ మ్యాచ్‌లకు ఐసీసీ రిజర్వ్ డే కేటాయించింది. ముందు రోజు మ్యాచ్ జరగకపోతే.. మరుసటి రోజు మ్యాచ్ నిర్వహిస్తారు. ముందు రోజు ఆగిపోయిన దగ్గర్నుంచే రెండో రోజు ఆటను కొనసాగిస్తారు. ఒకవేళ రిజర్వ్ డే కూడా మ్యాచ్ సాధ్యం కాక వర్షంతో మ్యాచ్ తుడిచిపెట్టుకుపోతే..ఏం చేస్తారనేది కీలకంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో మ్యాచ్ ఫలితం తేల్చే విధానంపైన ఐసీసీ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. ఐసీసీ నిబంధనల ప్రకారం, నాకౌట్ దశలో మ్యాచ్ ఫలితం రాకపోతే, సూపర్-8 దశలో అన్ని మ్యాచులు పూర్తయిన తరువాత సెమీస్ లో పోటీ పడిన రెండు జట్లలో మెరుగైన స్థానాల్లో ఉన్న జట్టే ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. సౌతాఫ్రికా, న్యూజిలాండ్ మ్యాచ్ వర్షంతో రద్దయితే సౌతాఫ్రికా ముందడుగు వేయనుండగా.. న్యూజిలాండ్ ఇంటిబాటపడుతోంది.




గ్రూప్-1లో సౌతాఫ్రికా టాపర్‌గా నిలవగా.. గ్రూప్-2లో న్యూజిలాండ్ రన్నరప్‌గా నిలిచింది. భారత్ - ఇంగ్లండ్ మ్యాచ్ రద్దయితే ఇంగ్లండ్ ఫైనల్ చేరుతుంది. ఎందుకంటే గ్రూప్-2లో ఇంగ్లండ్ టాప్‌లో నిలవగా.. గ్రూప్-1లో భారత్ రన్నరప్‌గా సెమీస్ చేరింది. అప్పుడు భారత్ మ్యాచ్ ఆడకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వస్తుంది. ఈ క్రమంలోనే సెమీఫైనల్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించవద్దని భారత అభిమానులు కోరుకుంటున్నారు.

## టీమిండియాది తొండాట: మహమ్మద్ అమీర్

పాకిస్థాన్ మాజీ పేసర్ మహమ్మద్ అమీర్ మరోసారి భారత్‌పై తన అక్కసును వెళ్లగక్కాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో టీమిండియా అసాధారణ ప్రదర్శనతో సెమీఫైనల్ చేరడాన్ని జీర్ణించుకోలేకపోతున్న అమీర్ సంచలన ఆరోపణలు చేశాడు. టీమిండియా తొండాటతో వెస్టిండీస్‌పై విజయం సాధించిందని ఆరోపించాడు. వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ హెట్‌మైర్ ఔటవ్వకున్నా అంపైర్లు ఔటిచ్చారని అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం అతని వ్యాఖ్యలు నెట్టింట తీవ్ర దుమారం రేపుతున్నాయి. మెగా టోర్నీ ప్రారంభమైనప్పటి నుంచే అమీర్.. భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడు. అభిషేక్ శర్మ గాలిగాడని, గుడ్డిగా బ్యాట్ ఊపుతాడని, అతని బ్యాటింగ్‌లో టెక్నిక్ లేదని విమర్శలు గుప్పించాడు. ఆ తర్వాత భారత్ ఎట్టి పరిస్థితుల్లో సెమీఫైనల్ చేరలేదని, సౌతాఫ్రికా, వెస్టిండీస్ టీమిండియా కంటే బలంగా ఉన్నాయని జోస్యం చెప్పాడు. సౌతాఫ్రికాతో భారత్ ఓటమి పాలవ్వగానే.. తన జోస్యం నిజమైందని శునకానందం పొందాడు. విండీస్ చేతిలో కూడా ఓడిపోతుందని బల్లగుద్ది చెప్పాడు. ఆదివారం కోల్‌కతా వేదికగా జరిగిన డూఆర్‌డై పోరులో సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో టీమిండియా 5 వికెట్ల తేడాతో గెలుపొంది సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. అయితే ఈ మ్యాచ్‌లో బుమ్రా బౌలింగ్‌లో డెంజరస్ హెట్‌మైర్ కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. అతని బ్యాట్, జెర్సీని తాకుతూ బంతి కీపర్ చేతిలో పడింది. బ్యాట్ తాకలేదని భావించిన హెట్‌మైర్ థర్డ్ అంపైర్ సమీక్ష కోరాడు. అల్ట్రా ఎడ్జ్‌లో బంతి బ్యాట్‌ను తాకినట్లుగా స్పైక్ కనిపించింది. దాంతో హెట్‌మైర్ పెవిలియన్ చేరాడు. ఆ సమయంలో ఈ నిర్ణయం పట్ల హెట్‌మైర్, విండీస్ కోచ్ డారెన్ సామీ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీన్ని అదనుగా భావించిన అమీర్.. టీమిండియా తొండాట ఆడిందని కొత్త రాగం ఎత్తుకున్నాడు.




## కోహ్లీ గెలిపించిన మ్యాచే అత్యుత్తమం: రోహిత్

టీ20 ప్రపంచకప్ 2022లో భాగంగా మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన పోరు తాము ఆడిన గొప్ప క్రికెట్ మ్యాచ్ అని టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో ఓడిపోయే మ్యాచ్‌లో విజయం సాధించామని గుర్తు చేసుకున్నాడు. ఇది చరిత్రలో నిలిచిపోయే మ్యాచ్ అని చెప్పుకొచ్చాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీకి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న రోహిత్ శర్మ.. ఆదివారం వెస్టిండీస్‌పై టీమిండియా విజయం సాధించి సెమీఫైనల్ చేరిన నేపథ్యంలో ఐసీసీతో ప్రత్యేకంగా మాట్లాడాడు. ఈ సందర్భంగా తాము ఆడిన రోజుల్లోనే ఐకానిక్ మ్యాచ్ గురించి చెప్పమని అడగ్గా.. మెల్‌బోర్న్ మైదానంలో జరిగిన మ్యాచ్‌ను గుర్తు చేసుకున్నాడు. '2022 టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్ మేం ఆడిన గొప్ప క్రికెట్ మ్యాచ్‌ల్లో ఒకటిగా నిలిచిపోతుంది. అది వరల్డ్ కప్ మ్యాచ్ కావడం.. టోర్నీలో నిలవాలంటే తప్పక గెలవాల్సిన పరిస్థితి ఉండటం.. ఓటమి అంచు నుంచి పుంజుకుని గెలవడం ఆ మ్యాచ్‌ను మరింత స్పెషల్‌గా మార్చింది. ఆ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఆట చూడటం నిజంగా చాలా చాలా ప్రత్యేకం. ఎందుకంటే మేం మ్యాచ్ ప్రారంభించిన విధానం చూస్తే.. అస్సలు గెలిచే స్థితిలోనే లేము. కానీ ముగించిన తీరు మాత్రం అమోఘం. విరాట్ కోహ్లీ బ్యాటింగ్ సందర్భంగా నేను డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్నాను. బయటకు వచ్చాను కానీ ఒత్తిడి వల్ల మళ్లీ లోపలికి వెళ్ళిపోయాను. మ్యాచ్‌లు ఇంత ఉత్కంఠభరితంగా ఉన్నప్పుడు ఎవరికైనా భయం వేస్తుంది. నేను కూడా చాలా ఆందోళన చెందాను. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాను. అప్పుడు విరాట్ కోహ్లీ ఒక సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. అసలు గెలుస్తామన్న ఆశ లేని స్థితి నుంచి జట్టును గెలిపించాడు. ఆ మ్యాచ్ ముగించిన విధానం అద్భుతం. ఇది ఖచ్చితంగా మేం ఆడిన అత్యంత గొప్ప క్రికెట్ మ్యాచ్‌ల్లో ఒకటి.'అని రోహిత్ శర్మ గుర్తు చేసుకున్నాడు.

## జూన్‌లో ఇండియాకు అఫ్ఘనిస్థాన్

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో భాగంగా భారత జట్టు స్వదేశంలో మరో సిరీస్ ఆడనుంది. దక్షిణాఫ్రికా చేతిలో వైట్‌వాష్‌తో రేసులో వెనకబడిన శుభ్‌మన్ గిల్ సేన.. జూన్‌లో సొంతగడ్డపైనే అఫ్ఘనిస్థాన్‌తో తలపడనుంది. రెండు ఫార్మాట్ల సిరీస్ కోసం అష్మతుల్లా షాహిదీ సారథ్యంలోని కాబూలీ టీమ్ జూన్‌లో భారత్‌కు రానుంది. ఏకైక టెస్టు మ్యాచ్‌తో ఇరుజట్ల మధ్య సిరీస్ ప్రారంభమవ్వనుంది. అనంతరం మూడు వన్డేల సిరీస్‌లో భారత్, అఫ్గన్ తలపడనున్నాయి. భారత్, అఫ్గనిస్థాన్ మధ్య ద్వైపాక్షిక సిరీస్ చివరగా 2024లో జరిగింది. అయితే.. ఇరుజట్ల మధ్య టెస్ట్ మ్యాచ్ ఆడి ఆరేళ్లవుతోంది. 2018లో చిన్నస్వామి స్టేడియంలో ఆతిథ్య భారత్ చేతిలో కాబూలీ టీమ్ ఇన్నింగ్స్ 262 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. సుదీర్ఘ విరామం తర్వాత టీమిండియాతో ఏకైక టెస్టు ఆడేందుకు కాబూలీ టీమ్ జూన్‌లో వచ్చేస్తోంది. న్యూ ఛండీగఢ్ స్టేడియంలో శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని భారత బృందంతో జూన్ 6వ తేదీన టెస్టు మ్యాచ్‌తో తలపడనుంది. అనంతరం మూడు వన్డేల సిరీస్‌లో భారత్, అఫ్గనిస్థాన్ ఢీ కొంటాయి.



## అభిషేక్‌పై విమర్శల బాణాలు

టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతన్ని పక్కన పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని కామెంట్ చేస్తున్నారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న అభిషేక్ శర్మ ఆటతీరు అస్సలు మారడం లేదు. ఈ టోర్నీలో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ అయిన అభిషేక్ శర్మ.. జింబాబ్వేతో మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో టచ్‌లోకి వచ్చినట్లు కనిపించాడు. కానీ కీలకమైన వెస్టిండీస్‌తో 10 పరుగులకే వెనుదిరిగాడు. ఆఫ్ స్పిన్నర్‌ను ఆడటంలో తన తడబాటును కొనసాగిస్తున్నాడు. 6 మ్యాచ్‌ల్లో కేవలం 80 పరుగులు మాత్రమే చేశాడు. మునపటిలా స్వేచ్ఛగా షాట్లు ఆడలేకపోతున్నాడు. బ్యాటింగే కాదు.. ఫీల్డింగ్‌లోనూ తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. విండీస్‌తో మ్యాచ్‌లో రెండు సునాయసమైన క్యాచ్‌లను నేలపాలు చేశాడు. సంజూ శాంసన్ పుణ్యమా.. ఈ మ్యాచ్‌లో భారత్ గట్టెక్కింది. లేకుంటే అభిషేక్ శర్మ తీవ్ర విమర్శలు ఎదుర్కొనేవాడు. అతన్ని పక్కన పెట్టి రింకూ సింగ్ లేదా ఎక్స్‌ట్రా బౌలర్‌ను ఆడించాలని నెటిజన్లు పిలుపునిస్తున్నారు. అభిషేక్ శర్మ జట్టుకు భారంగా మారాడని మండిపడుతున్నారు. అభిషేక్ శర్మ కాటేరమ్మ కొడుకు కాదని, శాతగాని కొడుకు అని ఘాటుగా విమర్శలు గుప్పిస్తున్నారు. సంజూ శాంసన్ ఫామ్‌లోకి వచ్చిన నేపథ్యంలో అభిషేక్ శర్మను పక్కన పెట్టి ఇషాన్ కిషన్‌ను ఓపెనర్‌గా ఆడించాలని డిమాండ్ చేస్తున్నారు. జింబాబ్వేతో మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో రాణించినా తన శైలికి భిన్నంగా ఆడాడు. ఈ క్రమంలోనే అభిషేక్ శర్మకు బదులు ఇతర ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలని సూచిస్తున్నారు.

# మెస్సీ మ్యాజిక్



మేజర్ లీగ్ సాకర్ మ్యాచ్‌లో ఇంటర్ మయామి, ఆర్లాండో సిటీపై 4-2 తేడాతో అద్భుతమైన విజయాన్ని సాధించింది. 0-2తో వెనుకబడినప్పటికీ, సెకండాఫ్‌లో మయామి పుంజుకున్న తీరు ఈ మ్యాచ్‌లో హైలైట్‌గా నిలిచింది. మ్యాచ్ ప్రారంభమైన వెంటనే ఫస్ట్ హాఫ్‌లో ఆర్లాండో సిటీ ఆధిపత్యం ప్రదర్శించింది. 18వ నిమిషంలో మార్కో పాసాలిక్, 24వ నిమిషంలో మార్టిన్ ఓజెడా గోల్స్ చేయడంతో ఆర్లాండో 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే, ద్వితీయార్థంలో ఇంటర్ మయామి అనూహ్యంగా పుంజుకుని వరుసగా నాలుగు గోల్స్ చేసి విజేతగా నిలిచింది. ఫస్ట్ హాఫ్‌లో మయామి డిఫెన్స్ చాలా బలహీనంగా కనిపించింది. అయితే, విరామం సమయంలో కోచ్ జేవియర్ మాస్చెరానో చేసిన వ్యూహాత్మక మార్పులు ఏకంగా మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాయి. లెఫ్ట్ బ్యాక్ నోహ్ అలెన్ స్థానంలో యువ స్ట్రైకర్ మేటియో సిల్వెట్టిని రంగంలోకి దించడంతో అటాకింగ్ అద్భుతంగా బలపడింది. ఇక ఆ జట్టు కీలక ఆటగాడు లియోనెల్ మెస్సీ మరోసారి తన క్లాస్ ఆటను ప్రేక్షకులకు చూపించాడు. 57వ నిమిషంలో స్కోరును సమం చేసిన మెస్సీ, మ్యాచ్ చివరి నిమిషంలో అద్భుతమైన ఫ్రీ-కిక్‌తో రెండో గోల్ కొట్టాడు. దీంతో 22 ఏళ్లుగా నిరంతరాయంగా గోల్స్, అసిస్ట్‌లు అందించిన అరుదైన రికార్డును మెస్సీ నెలకొల్పాడు. ఇక ఈ విజయంలో వెనిజులా మిడ్‌ఫీల్డర్ టెలాస్కో సెగోవియా కీలక పాత్ర పోషించాడు. అతను ఒక గోల్ చేయడమే కాకుండా, సహచర ఆటగాళ్లు రెండు గోల్స్‌కు చేసేందుకు సహకారం అందించాడు.

## పాక్ ప్లేయర్లకు భారీ జరిమానా

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కఠిన చర్య తీసుకున్నది. తాజాగా జరుగుతున్న టీ20 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్ జట్టు సూపర్ 8 స్టేజ్‌లోనే వైదొలిగిన విషయం తెలిసిందే. సెమీస్‌కు చేరకపోవడం పట్ల ఆ దేశ క్రికెట్ బోర్డు ఆగ్రహంగా ఉన్నది. ఈ నేపథ్యంలో ఆ దేశ క్రికెట్ బోర్డు తమ ఆటగాళ్లకు జరిమానా విధించింది. భారీగా ఫైన్ వేసింది. కీలక ప్లేయర్లపై ఒక్కొక్కరికి సుమారు 5 మిలియన్ల పాకిస్థాన్ రూపాయల జరిమానా విధించింది. అంటే ఒక్కో ప్లేయర్ సుమారు 17 లక్షలు ఫైన్ కట్టాల్సి ఉంటుంది. టోర్నీలో ఏమాత్రం పర్ఫార్మెన్స్ చేయని క్రికెటర్లకు ఈశిక్ష పడినట్లు తెలుస్తోంది. మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్, పేస్ బౌలర్ షహీన్ అఫ్రీది, ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్‌పైన కూడా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు జరిమానా విధించింది. తొలి రౌండ్‌లో ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో సరైన ఆటతీరును ప్రదర్శించని క్రికెటర్లకు ఈ జరిమానా వేసినట్లు తెలుస్తోంది. చెత్త పర్ఫార్మెన్స్‌ను ఏమాత్రం సహించేది లేదని పీసీబీ వెల్లడించింది.

ఈవార్తలు ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
మంగళవారం 3-3-2026

21వ శతాబ్దం ప్రారంభం నుండి యువత జీవన విధానంలో సంభవించిన వేగవంతమైన మార్పులు వారి మానసిక స్థైర్యంపై లోతైన ప్రభావం చూపుతున్నాయి. 2000 సంవత్సరంలో 15-29 వయస్సు గల యువతలో తీవ్రమైన మనోవేదన లక్షణాలు సుమారు 10%-12% మధ్య ఉన్నట్లు అంతర్జాతీయ స్థాయి అధ్యయనాలు సూచించాయి. 2010 నాటికి ఈ శాతం 15% కు చేరింది. 2020 మహమ్మారి తరువాత అనేక దేశాల్లో ఈ స్థాయి 22%-28% వరకు పెరిగింది. 2022 తరువాత కొంత తగ్గుదల కనిపించినా, 2015 కంటే ఎక్కువ స్థాయిలోనే కొనసాగుతోంది. యువతలో ఆందోళన లక్షణాలు 2005లో 8%-10% మధ్య ఉండగా, 2023 నాటికి కొన్ని ప్రాంతాల్లో 25% దాటాయి. 2024 గణాంకాల ప్రకారం 18-25 వయస్సు గల యువతలో 35% మంది తమ సామర్థ్యంపై అనిశ్చితి వ్యక్తం చేశారు. సుమారు 40% మంది ఇతరులతో పోల్చుకోవడం వల్ల స్వీయ విలువ తగ్గిందని పేర్కొన్నారు. భారతదేశంలో 15-29 వయస్సు గల యువజన జనాభా సుమారు 27%-30% మధ్య ఉంది. 2005లో యువతలో మానసిక రుగ్మతల అంచనా రేటు 8% చుట్టూ ఉండగా, 2015 నాటికి 14% కు పెరిగింది. 2020-2021 కాలంలో పట్టణ విద్యార్థుల్లో ఈ లక్షణాలు 25% వరకు నమోదయ్యాయి. 2024లో గ్రామీణ ప్రాంతాల్లో 18%, పట్టణ ప్రాంతాల్లో 24% వరకు మానసిక ఒత్తిడి స్థాయిలు కనిపించాయి. విద్యా పోటీ తీవ్రత గణనీయంగా పెరిగింది. 2010 తరువాత జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే వారి సంఖ్య 30% పైగా పెరిగింది. విజయం సాధించే శాతం 5%-15% మధ్య ఉండటం వల్ల 85%-95% మంది విఫలమవుతున్నారు. వరుస అపజయాలు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి.

# యువ ప్రాయంలో.. మనసంతా గడబిడ!



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

యువ నిరుద్యోగం 2019లో 17% ఉండగా, 2022లో 23% కు చేరింది. ఉపాధి భద్రతపై అనిశ్చితి యువతలో భయాన్ని పెంచుతోంది. 2023 సర్వేలో 40% యువత భవిష్యత్తుపై నమ్మకం తగ్గిందని తెలిపారు. సాంకేతిక వినియోగం వేగంగా పెరిగింది. 2015లో యువతలో చేతి దూర సంభాషణ పరికరాల వినియోగం 35% ఉండగా, 2025లో 85% దాటింది. రోజుకు 3 గంటలకు పైగా వినియోగం చేసే వారిలో ఆందోళన లక్షణాలు 50% వరకు అధికంగా నమోదయ్యాయి. నిద్ర లోపం మరో ప్రధాన కారణం. 2008లో 6-8 గంటల నిద్ర పొందే యువత శాతం 55% ఉండగా, 2022లో 35% కు పడిపోయింది. 6 గంటల కంటే తక్కువ నిద్ర ఉన్న వారిలో మనోవేదన ప్రమాదం 40%-45% ఎక్కువగా కనిపించింది. మహమ్మారి కాలంలో 70% విద్యార్థులు దూర విద్యా విధానానికి మారారు. 48% మంది ఏకాంత భావన అనుభవించారు. 2021లో యువతలో తీవ్రమైన మనోవేదన స్థాయి 25%-30% వరకు పెరిగింది.

**లింగ వ్యత్యాసాల పరంగా 2024లో యువ మహిళల్లో ఆందోళన 28% కాగా, యువ పురుషుల్లో 20% గా నమోదైంది. అయితే ప్రాణత్యాగాలు పురుషుల్లో 1.5 రెట్లు అధికంగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ ధోరణి కొనసాగితే 2030 నాటికి యువతలో మనోవేదన స్థాయి 30% చేరే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయి. ఉత్పాదకత 10%-15% వరకు తగ్గే ప్రమాదం ఉంది. దేశ ఆర్థిక వృద్ధిపై 2%-4% వరకు ప్రతికూల ప్రభావం ఉండవచ్చు. పరిష్కార దిశగా విద్యా సంస్థల్లో సలహా కేంద్రాలు 50% స్థాయిలో అమలు చేసిన ప్రాంతాల్లో మనోవేదన 8% తగ్గినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. రోజువారీ పరికర వినియోగాన్ని 2 గంటలకు పరిమితం చేసిన వారిలో 12 వారాల తరువాత ఆందోళన 20% తగ్గింది. వారానికి 150 నిమిషాల శారీరక వ్యాయామం చేసిన యువతలో ఆత్మవిశ్వాసం 30% మెరుగుపడింది. 7-8 గంటల నిద్ర పాటించిన వారిలో భావోద్వేగ స్థిరత్వం 25% పెరిగింది. కుటుంబ సభ్యులతో వారానికి 3 సార్లు సంభాషణలు జరిపిన సందర్భాల్లో ఒత్తిడి 18% తగ్గింది.**

సారాంశంగా 2000-2026 మధ్య గణాంకాలు యువతలో మానసిక శక్తి-ఆత్మవిశ్వాస క్షీణత ఒక గంభీర సామాజిక సమస్యగా రూపుదిద్దుకుందని స్పష్టం చేస్తున్నాయి. సమగ్ర విద్యా సంస్కరణలు, ఉపాధి అవకాశాల విస్తరణ, కుటుంబ మద్దతు బలోపేతం, ఆరోగ్య సేవల విస్తరణ అమలు అయితే 5-10 సంవత్సరాల్లో 15%-20% వరకు మెరుగుదల సాధ్యమని విశ్లేషణలు సూచిస్తున్నాయి. యువత మానసిక స్థైర్య రక్షణ భవిష్యత్తు సమాజ స్థిరత్వానికి పునాది. 2000 సంవత్సరం నుండి యువత మానసిక ఆరోగ్య పరిస్థితిపై ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రముఖ పరిశోధనా సంస్థలు విస్తృత అధ్యయనాలు నిర్వహించాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2001, 2014, 2019, 2022 నివేదికలలో 15-29 వయస్సు గల యువతలో మానసిక రుగ్మతల ప్రబలత 13%-15% మధ్య ఉందని పేర్కొంది. 2020 మహమ్మారి అనంతరం ఈ స్థాయి 25% వరకు పెరిగినట్లు 2022 అంచనాలు వెల్లడించాయి. యువత మరణాలకు కారణాలలో ఆత్మహత్య ప్రధాన కారణాలలో ఒకటిగా నమోదైనట్లు అదే సంస్థ వెల్లడించింది. యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్ 2021 ప్రపంచ బాలల స్థితిగతుల నివేదికలో 10-19 వయస్సు గల యువకుల్లో 20% మందికి పైగా మానసిక సమస్యలు ఉన్నట్లు పేర్కొంది. మహమ్మారి కాలంలో 27% యువత భవిష్యత్తుపై ఆశ తగ్గిందని తెలిపింది.

ప్రపంచ ఆర్థిక వేదిక 2019, 2023 నివేదికల ప్రకారం ఉద్యోగ భద్రతపై అనిశ్చితి 40% యువతలో ఉన్నట్లు వెల్లడించింది. నిరుద్యోగం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆత్మవిశ్వాస లోపం 30%-35% వరకు నమోదైంది. అమెరికన్ సైకాలజికల్ అసోసియేషన్ 2018, 2020, 2023 ఒత్తిడి సర్వేల ప్రకారం 18-23 వయస్సు గల యువతలో 45% మంది తీవ్రమైన ఆందోళన అనుభవించినట్లు తెలిపారు. 2020లో ఈ శాతం 50% దాటింది. అమెరికా వ్యాధి నియంత్రణ నివారణ కేంద్రం 2021 యువజన ప్రవర్తనా సర్వేలో 42% విద్యార్థులు నిరంతర నిరాశ అనుభవించినట్లు వెల్లడించింది. ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ 2022 నివేదిక ప్రకారం 15-24 వయస్సు గల యువతలో మనోవేదన లక్షణాలు మహమ్మారి ముందు 14% ఉండగా, 2021లో 26% కు చేరాయి. భారతదేశంలో భారత వైద్య పరిశోధనా మండలి 2017 జాతీయ మానసిక ఆరోగ్య సర్వేలో 13% యువతలో మానసిక రుగ్మతలు ఉన్నట్లు వెల్లడించింది. జాతీయ మానసిక ఆరోగ్య నర విజ్ఞాన సంస్థ 2021 నివేదికలో మహమ్మారి కాలంలో విద్యార్థుల్లో ఆందోళన 30% వరకు పెరిగినట్లు పేర్కొంది. టాటా సామాజిక శాస్త్రాల సంస్థ 2022 అధ్యయనంలో రోజుకు 4 గంటలకు పైగా సామాజిక మాధ్యమ వినియోగం చేసే యువతలో ఆత్మవిశ్వాస లోపం 52% వరకు నమోదైనట్లు తెలిపింది.

ప్యూ పరిశోధనా కేంద్రం 2018, 2022 నివేదికల ప్రకారం 59% యువత ఇతరులతో పోల్చుకోవడం పెరిగిందని తెలిపారు. ఐక్యరాజ్య సమితి విద్యా శాస్త్ర సాంస్కృతిక సంస్థ 2021 నివేదికలో 70% విద్యార్థులు విద్యా అంతరాయం ఎదుర్కొన్నట్లు పేర్కొంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ 2022 నివేదిక ప్రకారం ప్రపంచ యువ నిరుద్యోగం 23% కు చేరింది. నిరుద్యోగం అధికంగా ఉన్న ప్రాంతాల్లో మానసిక ఒత్తిడి 35% వరకు పెరిగినట్లు వెల్లడించింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం 2023 పరిశోధన ప్రకారం రోజుకు 3 గంటలకు పైగా సామాజిక మాధ్యమ వినియోగం చేసే యువతలో మనోవేదన ప్రమాదం 40% అధికంగా ఉంది. ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయం 2022 అధ్యయనం ప్రకారం 6 గంటల కంటే తక్కువ నిద్ర ఉన్న యువతలో భావోద్వేగ స్థిరత్వం 25% తగ్గింది. ఈ అన్ని పరిశోధనా సంస్థల నివేదికలు 2000-2026 మధ్య యువతలో మానసిక శక్తి-ఆత్మవిశ్వాస క్షీణత ఒక స్థిరమైన పెరుగుదల ధోరణి అనుసరిస్తోందని స్పష్టం చేస్తున్నాయి. సమగ్ర విద్యా సంస్కరణలు, ఉపాధి అవకాశాల విస్తరణ, కుటుంబ మద్దతు బలోపేతం, ఆరోగ్య సేవల విస్తరణ అమలు అయితే 5-10 సంవత్సరాల్లో 15%-20% వరకు మెరుగుదల సాధ్యమని పలు సంస్థలు సూచిస్తున్నాయి.

2000 సంవత్సరం నుండి 2026 వరకు లభ్యమైన గణాంకాలు, జాతీయ స్థాయి అధ్యయనాలు, అంతర్జాతీయ ఆరోగ్య సంస్థల నివేదికలు ఒక స్పష్టమైన సంకేతాన్ని ఇస్తున్నాయి. యువతలో మానసిక శక్తి తగ్గుదల, ఆత్మవిశ్వాస క్షీణత, ఆందోళన, మనోవేదన, భవిష్యత్తుపై అనిశ్చితి క్రమంగా పెరుగుతున్నాయి. 2000లో 10%-12% మధ్య ఉన్న తీవ్రమైన మనోవేదన స్థాయి 2020 తరువాత కొన్ని ప్రాంతాల్లో 25%-30% వరకు పెరిగింది. 2010లో 15% చుట్టూ



ఉన్న ఆందోళన లక్షణాలు 2023 నాటికి 25% దాటిన సందర్భాలు నమోదయ్యాయి. యువ నిరుద్యోగం 2019లో 17% ఉండగా 2022లో 23% చేరింది. ఈ గణాంకాలు కేవలం సంఖ్యలు కాదు; ఇవి భవిష్యత్ సమాజ నిర్మాణానికి సంబంధించిన హెచ్చరికలు. యువత అనేది దేశ జనాభాలో అత్యంత శక్తివంతమైన వర్గం. భారతదేశం వంటి దేశాల్లో 15-29 వయస్సు గల జనాభా 27%-30% మధ్య ఉండటం ఒక మహత్తర అవకాశంగా భావించబడుతుంది. అయితే ఇదే వర్గం మానసిక స్థైర్యాన్ని కోల్పోతే జనాభా లాభం బలహీనంగా మారే ప్రమాదం ఉంది. ఉత్పాదకత 10%-15% తగ్గే అవకాశం ఉన్నట్టు ఆర్థిక విశ్లేషణలు సూచిస్తున్నాయి. దేశ స్థూల ఉత్పత్తిపై 2%-4% ప్రతికూల ప్రభావం ఉండవచ్చు. ఈ నేపథ్యంలో ముగింపుగా పలు కీలక అంశాలను సమగ్రంగా పరిశీలించాలి. మొదటగా విద్యా వ్యవస్థలో సంస్కరణలు అత్యవసరం. 2010 తరువాత పోటీ పరీక్షల సంఖ్య 30% పైగా పెరిగింది. విజయం సాధించే శాతం 5%-15% మధ్య మాత్రమే ఉంది. వరుస అపజయాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. పాఠశాల స్థాయిలో భావోద్వేగ నైపుణ్య శిక్షణ ప్రవేశపెడితే 5 సంవత్సరాల్లో 12% వరకు ఆందోళన తగ్గుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. విద్యార్థులలో స్వీయ అవగాహన, విఫలతను అంగీకరించే ధైర్యం, సమయ నిర్వహణ వంటి నైపుణ్యాలు పెంపొందితే దీర్ఘకాలిక లాభం ఉంటుంది.

రెండవది ఉపాధి అవకాశాల విస్తరణ. 2022లో యువ నిరుద్యోగం 23% స్థాయికి చేరడం ఆందోళనకరం. ఉపాధి భద్రత పెరిగితే యువతలో భవిష్యత్ నమ్మకం 20% వరకు మెరుగుపడుతుందని ఆర్థిక అధ్యయనాలు సూచిస్తున్నాయి. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు 3-5 సంవత్సరాల్లో 15% వరకు ఉద్యోగ సాధన శాతాన్ని పెంచగలవు. మూడవది సాంకేతిక వినియోగ నియంత్రణ. 2015లో 35% ఉన్న చేతి పరికర వినియోగం 2025లో 85% దాటింది. రోజుకు 3 గంటలకు పైగా వినియోగం చేసే యువతలో ఆందోళన 50% అధికంగా నమోదైంది. వినియోగాన్ని 2 గంటలకు పరిమితం చేస్తే 12 వారాల్లో 20% వరకు ఒత్తిడి తగ్గుతుందని అధ్యయనాలు తెలియజేశాయి. కుటుంబ స్థాయిలో సాంకేతిక విరామ సమయాలు అమలు చేస్తే భావోద్వేగ అనుబంధం 18% పెరుగుతుంది. నాలుగవది నిద్ర, శారీరక వ్యాయామం. 2008లో 6-8 గంటల నిద్ర పొందే యువత 55% ఉండగా 2022లో 35% కు తగ్గింది. 7-8 గంటల నిద్ర పాటించిన వారిలో భావోద్వేగ స్థిరత్వం 25% మెరుగుపడింది. వారానికి 150 నిమిషాల శారీరక వ్యాయామం చేసిన యువతలో ఆత్మవిశ్వాసం 30% పెరిగింది. ఈ రెండు అంశాలు తక్కువ వ్యయంతో సాధ్యమయ్యే సమర్థవంతమైన మార్గాలు. ఐదవది కుటుంబ నిర్మాణ బలోపేతం. 2000లో సంయుక్త కుటుంబాలు 45% ఉండగా 2025లో 20% కు పడిపోయాయి. కుటుంబ సంభాషణలు వారానికి కనీసం 3 సార్లు జరిగితే యువతలో ఒత్తిడి 18% తగ్గుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. తల్లిదండ్రుల భావోద్వేగ మద్దతు యువత ఆత్మవిశ్వాసానికి ప్రాథమిక పునాది. ఆరవది మానసిక ఆరోగ్య సేవల విస్తరణ. విద్యా సంస్థల్లో కనీసం 50% వరకు సలహా కేంద్రాలు ఏర్పాటు చేస్తే 5 సంవత్సరాల్లో మనోవేదన 8%-10% తగ్గుతుందని అనేక నివేదికలు తెలియజేశాయి. గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందుబాటులో లేకపోవడం ప్రధాన సమస్య. డిజిటల్ సలహా సేవలు విస్తరించినా, ప్రత్యక్ష మానవ సంబంధం కీలకం.

లింగ ఆధారిత వ్యత్యాసాలను కూడా గుర్తించాలి. 2024లో యువ మహిళల్లో ఆందోళన 28% కాగా యువ పురుషుల్లో 20% నమోదైంది. అయితే ప్రాణత్యాగాలు పురుషుల్లో 1.5 రెట్లు అధికంగా ఉన్నాయి. మహిళల్లో సామాజిక పోలిక ప్రభావం 60% వరకు ఉన్నట్టు సర్వేలు సూచించాయి. కాబట్టి లింగ సున్నిత దృక్పథంతో ప్రత్యేక కార్యక్రమాలు అవసరం. మహమ్మారి ప్రభావం 2020-2022 కాలంలో గరిష్ఠ స్థాయికి చేరింది. 70% విద్యార్థులు దూర విద్యా విధానానికి మారడం, 48% ఏకాంత భావన అనుభవించడం, 25%-30% వరకు మనోవేదన పెరగడం దీర్ఘకాలిక మానసిక ప్రభావాలను మిగిల్చింది. 2023 తరువాత కొంత మెరుగుదల ఉన్నప్పటికీ 2019 స్థాయికి పూర్తిగా చేరలేదు. కాబట్టి సంక్షోభాల సమయంలో ముందస్తు మానసిక రక్షణ విధానాలు అవసరం. 2030 అంచనాల ప్రకారం ప్రస్తుత ధోరణి కొనసాగితే యువతలో తీవ్రమైన మనోవేదన 30% చేరే ప్రమాదం ఉంది. అయితే సమగ్ర చర్యలు అమలు చేస్తే 5-10 సంవత్సరాల్లో 15%-20% వరకు మెరుగుదల సాధ్యమని పలు విశ్లేషణలు సూచిస్తున్నాయి. 2035 నాటికి మానసిక ఆరోగ్యాన్ని ప్రాథమిక ఆరోగ్య విధానంలో భాగం చేస్తే దీర్ఘకాలిక లాభం 25% వరకు ఉండవచ్చు. ముగింపుగా చెప్పాల్సిన ముఖ్య అంశం ఏమిటంటే యువత మానసిక శక్తి కేవలం వ్యక్తిగత లక్షణం కాదు; అది సామాజిక వనరు. కుటుంబం, విద్యా వ్యవస్థ, ఉపాధి నిర్మాణం, ఆరోగ్య సేవలు, సాంకేతిక వినియోగ నియంత్రణ సమన్వయంతో పనిచేస్తే యువత ఆత్మవిశ్వాసం పునర్నిర్మాణం సాధ్యమవుతుంది. 2000-2026 గణాంకాలు హెచ్చరికగా కనిపించినా, సమగ్ర కార్యాచరణతో 2030 తరువాతి దశాబ్దం పునరుద్ధరణ దశగా మారే అవకాశం ఉంది. వత మానసిక స్థైర్యం రక్షణ అనేది దేశ భవిష్యత్తు రక్షణతో సమానం. ప్రతి కుటుంబం, ప్రతి విద్యా సంస్థ, ప్రతి విధాన నిర్ణేత ఈ దిశగా 1 అడుగు ముందుకు వేస్తే సమిష్టి ప్రభావం 100% సామాజిక మార్పుకు దారితీస్తుంది. 5 సంవత్సరాల ప్రణాళికతో ప్రారంభించి 10 సంవత్సరాల వ్యూహంతో అమలు చేస్తే 20%-30% వరకు మానసిక ఆరోగ్య మెరుగుదల సాధ్యమవుతుంది. అదే భవిష్యత్తు సమాజ స్థిరత్వానికి పునాది అవుతుంది.

ఇప్పటి వరకు పరిశీలించిన గణాంకాలు 2000-2026 మధ్య యువత మానసిక స్థితిలో వచ్చిన మార్పులను స్పష్టంగా తెలియజేశాయి. అయితే ముగింపుగా మరింత లోతుగా ఆలోచించాల్సిన అంశం ఏమిటంటే ఈ ధోరణి కొనసాగితే సమాజ నిర్మాణం, ఆర్థిక వ్యవస్థ, కుటుంబ విలువలు, జాతీయ ఉత్పాదకతపై దీర్ఘకాలిక ప్రభావం ఎంతవరకు ఉంటుందన్నది. 15-29 వయస్సు గల వర్గం దేశ శక్తి కేంద్రం. ఈ వర్గంలో 20%-30% వరకు మానసిక ఒత్తిడి, ఆందోళన, ఆత్మవిశ్వాస లోపం కొనసాగితే అది వ్యక్తిగత సమస్యగా కాక సామాజిక నిర్మాణ సమస్యగా మారుతుంది. మొదట వ్యక్తి స్థాయిలో ప్రభావం చూడాలి. ఆత్మవిశ్వాసం తగ్గిన యువకుడు లేదా యువతి నిర్ణయ సామర్థ్యంలో 25% వరకు వెనుకబడే అవకాశం ఉందని కొన్ని ప్రవర్తనా అధ్యయనాలు సూచిస్తున్నాయి. నిరంతర ఒత్తిడి ఉన్న సందర్భాల్లో దీర్ఘకాల లక్ష్యాలపై దృష్టి 30% వరకు తగ్గుతుంది. దీని ఫలితంగా విద్యా ప్రగతి మందగిస్తుంది. 5 సంవత్సరాల వ్యవధిలో ఇది 10%-15% విద్యా ఫలితాల తగ్గుదలకు దారితీయవచ్చు.

**రెండవది కుటుంబ స్థాయి ప్రభావం. యువతలో 35% వరకు అనిశ్చితి భావన ఉన్నప్పుడు కుటుంబ సంబంధాల్లో ఉద్రిక్తత 18%-22% వరకు పెరుగుతుంది. సంభాషణ లోపం పెరిగితే తరం మధ్య అవగాహన 20% వరకు తగ్గుతుంది. ఇది సామాజిక ఏకత్వంపై ప్రభావం చూపుతుంది. కుటుంబ మద్దతు బలంగా ఉన్న యువతలో ఆత్మవిశ్వాసం 28% ఎక్కువగా ఉన్నట్టు కొన్ని అధ్యయనాలు తెలియజేశాయి. కాబట్టి కుటుంబ వ్యవస్థ బలోపేతం కీలకం. మూడవది ఆర్థిక ప్రభావం. యువతలో ఉత్పాదకత 10% తగ్గితే దేశ స్థూల ఉత్పత్తిపై 2%-4% ప్రభావం ఉండే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషణలు సూచిస్తున్నాయి. దీర్ఘకాలికంగా 10 సంవత్సరాల వ్యవధిలో ఇది 5%-7% వృద్ధి నష్టానికి దారితీయవచ్చు. మానసిక ఆరోగ్య సమస్యల చికిత్స, పనితీరు లోపం, ఉద్యోగ మార్పులు వంటి అంశాలు ఆర్థిక వ్యయాన్ని 3% వరకు పెంచవచ్చు. నాలుగవది సామాజిక ప్రవర్తన. ఆందోళన స్థాయి 25% పైగా ఉన్న సమూహాల్లో ఆవేశ ప్రవర్తన 15% పెరిగినట్టు ప్రవర్తనా గణాంకాలు సూచిస్తున్నాయి. చిన్న విషయాలకు ప్రతిస్పందన తీవ్రత 20% అధికమవుతుంది. సామాజిక మాధ్యమాల ద్వారా తక్షణ స్పందన సంస్కృతి పెరగడం దీన్ని మరింత పెంచుతుంది. రోజుకు 4 గంటలకు పైగా డిజిటల్ వినియోగం ఉన్న యువతలో సహనం స్థాయి 18% తగ్గినట్టు పరిశీలనలు తెలియజేశాయి. ఐదవది ఆరోగ్య సంబంధిత దీర్ఘకాల ప్రభావం. 6 గంటల కంటే తక్కువ నిద్ర ఉన్న యువతలో 40% వరకు మనోవేదన ప్రమాదం ఉందని గణాంకాలు తెలిపాయి. అదే విధంగా దీర్ఘకాల ఒత్తిడి ఉన్నవారిలో రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు 15% వరకు అధికమయ్యే అవకాశం ఉంది. కాబట్టి మానసిక ఆరోగ్యం శారీరక ఆరోగ్యానికి ప్రత్యక్ష సంబంధం కలిగి ఉంది.**

ఇప్పుడు పరిష్కార దిశగా 2026-2040 దృక్పథాన్ని పరిశీలించాలి. మొదట విద్యా విధానంలో భావోద్వేగ విద్యను 100% పాఠశాలల్లో ప్రవేశపెట్టాలి. 5 సంవత్సరాల వ్యవధిలో ఇది 12%-18% వరకు ఆందోళన తగ్గుదలకు దోహదపడుతుంది. ప్రతి కళాశాలలో మానసిక సలహా కేంద్రం ఉంటే 8%-10% వరకు మనోవేదన తగ్గవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో సేవల విస్తరణతో 15% వరకు మెరుగుదల సాధ్యమవుతుంది. రెండవది ఉపాధి దిశ. నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ప్రతి సంవత్సరం 5% యువతకు అందితే 10 సంవత్సరాల్లో 50% యువత నైపుణ్యంతో సిద్ధమవుతుంది. ఇది నిరుద్యోగాన్ని 23% నుండి 15% వరకు తగ్గించే అవకాశముంది. ఉపాధి భద్రత పెరిగితే ఆత్మవిశ్వాసం 20% వరకు మెరుగుపడుతుంది. మూడవది సాంకేతిక నియంత్రణ. రోజువారీ వినియోగాన్ని 2 గంటలకు పరిమితం చేసే కుటుంబ నియమాలు అమలు చేస్తే 6 నెలల్లో 15% ఒత్తిడి తగ్గుదల కనిపించవచ్చు. వారానికి 1 రోజు డిజిటల్ విరామం పాటిస్తే భావోద్వేగ స్థిరత్వం 10%-12% మెరుగుపడుతుంది. ఇది 5 సంవత్సరాల్లో పెద్ద సామాజిక మార్పుకు దారి తీస్తుంది. నాలుగవది శారీరక చురుకుదనం. ప్రతి యువకుడు వారానికి కనీసం 150 నిమిషాల వ్యాయామం చేస్తే 30% వరకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇది 10 సంవత్సరాల కాలంలో మానసిక ఆరోగ్య సమస్యలను 20% వరకు తగ్గించగలదు. విద్యా సంస్థల్లో ప్రతిరోజూ 30 నిమిషాల క్రీడా కార్యక్రమం అమలు చేస్తే విద్యార్థుల భావోద్వేగ స్థిరత్వం 18% మెరుగుపడుతుంది. ఐదవది సమాజ స్థాయి అవగాహన. ప్రతి సంవత్సరం మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే సహాయం కోరే యువత శాతం 25% పెరుగుతుంది. ప్రస్తుతం సహాయం కోరే శాతం 30% లోపే ఉందని అంచనాలు సూచిస్తున్నాయి. దానిని 60% వరకు పెంచగలిగితే ప్రాణత్యాగాల రేటు 10%-15% తగ్గే అవకాశం ఉంది. లింగ సున్నిత దృక్పథంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటే మహిళల్లో 28% ఉన్న ఆందోళన స్థాయి 5 సంవత్సరాల్లో 20% కు తగ్గవచ్చు. పురుషుల్లో 1.5 రెట్లు అధికంగా ఉన్న ప్రాణత్యాగాల రేటు 10 సంవత్సరాల్లో 20% వరకు తగ్గవచ్చు. 2035 నాటికి సమగ్ర విధానాలు అమలు చేస్తే యువతలో తీవ్రమైన మనోవేదన స్థాయి 30% అంచనాల నుండి 18%-20% వరకు తగ్గే అవకాశం ఉంది. 2040 నాటికి ఇది 15% స్థాయికి చేరితే 2000 స్థాయికి సమీపంగా తీసుకురావడం సాధ్యమవుతుంది. దీని ఫలితంగా ఉత్పాదకత 12% వరకు పెరుగుతుంది. దేశ స్థూల ఉత్పత్తి 3%-5% అదనపు వృద్ధి సాధించగలదు. ముగింపుగా స్పష్టంగా చెప్పగల విషయం ఏమిటంటే యువత మానసిక శక్తి కేవలం వ్యక్తిగత ధైర్యం కాదు; అది జాతీయ మూలధనం. 2000-2026 గణాంకాలు హెచ్చరికగా నిలిచినా, 2026 తరువాతి దశాబ్దం కార్యాచరణ దశగా మారితే 15%-30% వరకు సానుకూల మార్పు సాధ్యమవుతుంది. కుటుంబం 1 అడుగు, విద్యా వ్యవస్థ 1 అడుగు, ప్రభుత్వం 1 అడుగు ముందుకు వేస్తే సమిష్టి ప్రభావం 100% మార్పుకు దారి తీస్తుంది. యువత ఆత్మవిశ్వాసం పునర్నిర్మాణం అనేది 5 సంవత్సరాల తక్షణ ప్రణాళిక, 10 సంవత్సరాల మధ్యకాల వ్యూహం, 15 సంవత్సరాల దీర్ఘకాల దృష్టితో అమలు చేయాల్సిన కార్యాచరణ. ఈ మార్గంలో నడిస్తే 2040 నాటికి మానసిక స్థైర్యం గల యువజన శక్తి దేశ అభివృద్ధికి 200% ఉత్సాహాన్ని అందించగలదు. అదే భవిష్యత్తు సమాజ స్థిరత్వానికి, ఆర్థిక పురోగతికి, సామాజిక సమతుల్యతకు పునాది అవుతుంది.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.